PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 151, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 22 - జూలై - 2026 , వెల రూ.5/-

## విద్యార్థుల ఆందోళనల వేళ.. నీట్ లీక్‌పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

- నీట్ పేపర్ లీక్ దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న ప్రధాని మోదీ
- పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించాలని సూచన
- పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళనకారుల డిమాండ్
- నిరసనకారులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు.. కొనసాగుతున్న ఉత్కంఠ

ఢిల్లీ,: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని




## ‘సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు’.. కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు




- విద్యార్థులపై పోలీసు చర్యలను ఖండించిన కేటీఆర్
- ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని వ్యాఖ్య
- విభేదాల గొంతు నొక్కే ప్రయత్నం ఆపాలంటూ కేంద్రానికి చురకలు
- విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ నేత
- ఈ ప్రతిఘటనను పది నెలల క్రితమే ఊహించినట్లు వెల్లడి

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్.. దావోస్ ఒప్పందానికి కీలక ముందడుగు

- దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం



అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావడంలోభాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి: బొత్స




యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స

## గల్లా మాధవి ఏ దావా వేసినా ఎదుర్కొంటా: అంబటి రాంబాబు




- గుంటూరులో మహిళపై దాడి చేసిన ఘటనపై తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్న అంబటి
- ఈ ఘటనను గల్లా మాధవి సెటిల్‌మెంట్ చేయడానికి యత్నించారని ఆరోపణ
- ఘటన జరిగిన వెంటనే పోలీసులు కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్న

## ఢిల్లీలో హైటెన్షన్..

### ప్రధాని ఇంటి ముందు రాహుల్, ప్రియాంక ధర్నా




- పార్లమెంట్ నుంచి ప్రధాని ఇంటికి పాదయాత్రగా వెళ్లిన కాంగ్రెస్ నేతలు
- ప్రధాని నివాసం ముట్టడికి యత్నం అడ్డుకున్న పోలీసులు
- ప్రధాని నివాసం ముందు బైఠాయించిన కాంగ్రెస్ అగ్రనేతలు

## ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి బీసీ గురుకులాలపై మంత్రి పొన్నం ఆదేశాలు

- విద్యార్థులకు విద్యతో పాటు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్న పొన్నం
- ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశం
- తాను కూడా ప్రతి నెల కనీసం 15 గురుకులాల్లో తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడి




హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల వసతులపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన నిబంధనలు విధించారు. బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌లతో (ఆర్‌సీవో) కీలకమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన... రాబోయే ఆగస్టు 30వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో

## కేంద్రమంత్రికి రాజీనామా లేఖ రాయడం రాదేమో!

### - మహువా మొయిత్రా ఎద్దేవా




నీట్ వివాదంపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై మహువా మొయిత్రా ఆగ్రహం రాజీనామా లేఖ రాయడం రాదేమోనని ఎక్స్‌లో ఎద్దేవా

ఢిల్లీ,: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బహుశా రాజీనామా లేఖ రాయడం కూడా తెలియదేమోనంటూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)

## మళ్లీ ఢిల్లీ బాట పట్టిన రైతులు.. శంభూ సరిహద్దులో అడ్డుకున్న పోలీసులు




ఢిల్లీ,: ఇప్పటికే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు, ఆందోళనలతో దేశ రాజధాని ఢిల్లీలో హైఅలర్ట్ కొనసాగుతోంది. ఈ తరుణంలో పంజాబ్ నుంచి వందలాది మంది రైతులు ఢిల్లీ దిశగా రావడం కలకలం రేకెత్తించింది. దీంతో వారిని నగర సరిహద్దుల్లో శంభూ వద్ద హర్యానా పోలీసులు అడ్డుకున్నారు.




## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు: హరీశ్ రావు

- దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్
- దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా




## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం: రఘునందన్ రావు

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై సీబీఐ దర్యాప్తు వేగంగా జరుగుతోందన్న రఘునందన్ రావు

## ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దు: కవిత

- కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది..
- ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి అందజేత
- హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఆ కమిటీకి సూచించారు
- 1969 ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కూడా ఇందులో చేర్చాలని గుర్తింపు కమిటీకి స్పష్టం
- గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు




హైదరాబాద్,: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి అందజేశారు. మంగళవారం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి కార్యాలయంలో ఉద్యమకారుల ఎంపిక కమిటీ సమావేశం అయింది. ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగిన తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించటం, గౌరవించటం కోసం కమిటీ ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు.

## ‘బట్టలు పెట్టి పట్టాలిస్తా’.. మంగళగిరిలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్




- మంగళగిరిలో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్
- ‘మన ఇల్లు - మన లోకేశ్’ కార్యక్రమంలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- సుమారు రూ.1000 కోట్ల విలువైన భూమికి శాశ్వత హక్కులు
- మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న మంత్రి
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి వేగవంతం అవుతుందన్న భరోసా

అమరావతి,: ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని నెరవేరుస్తూ, ‘బట్టలు పెట్టి పట్టాలిస్తా’ అన్న మాటను నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ‘మన ఇల్లు - మన లోకేశ్’ కార్యక్రమం

## "రైతు క్షేమమే సొసైటీల కర్తవ్యం : ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్"



తాడేపల్లిగూడెం, జూలై 21 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: రైతులక్షేమమే సొసైటీల ప్రధాన కర్తవ్యమని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో, సొసైటీ చైర్మన్ సిద్ధా వీర్రాజు ఆధ్వర్యంలోఎరువుల విక్రయ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరించి తగిన తోడ్పాటు అందించాలని అన్నారు.తాడేపల్లిగూడెం సహకార సంఘం 34 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రైతులకు ఎరువుల విక్రయాలను ప్రారంభించామని తెలిపారు. బిజెపి ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ ఇన్‌పుట్లను సొసైటీల ద్వారానే అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎరువులపై భారీ సబ్సిడీ అందిస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.తాడేపల్లి గూడెం సొసైటీలో ఎరువుల విక్రయాలు ప్రారంభం కావడం వల్ల పరిసర ప్రాంతాల రైతులు అవసరమైన ఎరువులను స్థానికంగానే సులభంగా పొందే అవకాశం కలుగుతుందని, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## "జూనియర్ కళాశాలకు రూ.10 లక్షలు భారీ విరాళం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్"



తాడేపల్లిగూడెం జూలై 21 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణం కోసం శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10,00,000/- (పది లక్షలు) రూపాయలు భారీ విరాళం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి 4 విధానంలో నిర్మిస్తున్న ఈ జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యేతో పాటు వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5,00,000/- (ఐదు లక్షలు),చలంచర్ల మురళి రూ.2,00,000/- (రెండు లక్షలు) విరాళాలను మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జూనియర్ కళాశాలకు ఎంతో కాలంగా సొంత భవనం లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యను తమ హయాంలో పరిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎందరో ప్రముఖులు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. విద్య కోసం చేసే వ్యయం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలనే ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నన్నయ విశ్వవిద్యాలయం వద్ద క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా మంత్రి లోకేష్ లు విద్యారంగంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరగాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పవర్ మెక్ ఫౌండేషన్ సహకారంతో వాసవి క్లబ్ పుస్తకాల పంపిణీ



నేటి శుభోదయ : తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేట గ్రామంలోని ఎంపీపీ నెంబర్ వన్ పాఠశాల యందు పవర్ మెక్ ఫౌండేషన్ సహకారంతో వాసవి క్లబ్ పుస్తకాల పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు ఆలపాటి కృష్ణకుమార్, కార్యదర్శి ముత్తా శ్రీధర్ గుప్తా, కోశాధికారి పులవర్తి ప్రశాంత్ అధ్యక్షత వహించి పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పుష్పాలంకరణ చేసి నివాళులర్పించి తదనంతరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. 136 మంది విద్యార్థులకు 544 నోట్ పుస్తకాలను, పెన్సిల్ స్కేల్ ఎరేజర్ తో కూడిన పౌచ్, బిస్కెట్ ప్యాకెట్లను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. వాసవి క్లబ్ అనగానే సేవకు ప్రతిరూపంగా భావించే ఈ అద్భుత కార్యక్రమానికి సహకరించిన సబ్జా కిషోర్ కుమార్, లక్ష్మీ దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడియాల కృష్ణమూర్తి, నాగగీతా వాణి, పాబోలు చంటి, పెనుగొండ శ్రీనివాసరావు(రిపోర్టర్), వనిత క్లబ్ రాష్ట్ర నాయకులు ఆలపాటి అచ్యుత లక్ష్మి, కొండూరి పద్మలత, జనసేన నాయకులు కొండయ్య, పాఠశాల అధ్యాపక బృందం నాగేశ్వరరావు, సత్యనారాయణ, కుమారి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## పెందుర్తి పోలీసుల దాడి

**- అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్‌పై కేసు నమోదు**



( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ పర్యవేక్షణలో, విశ్వసనీయ సమాచారం మేరకు, లక్ష్మీపురం జంక్షన్‌లోని ఓ పాన్ షాప్ వద్ద పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా మిండి గౌరీ శంకర్ (36) అనే వ్యక్తి ఎటువంటి చట్టబద్ధమైన లైసెన్స్ లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుండి మొత్తం 22 మద్యం సీసాలు (3.96 లీటర్లు), సుమారు రూ.3,101/- విలువైన మద్యంను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పెందుర్తి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం.291/2026, సెక్షన్ 34(ఏ )(ఐ ) ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పెందుర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ గారు మాట్లాడుతూ, అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించడం, లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే, ప్రజలు అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 ద్వారా పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే సమాజంలో శాంతిభద్రతలు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడగలమని పేర్కొన్నారు.

## "గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి"ఎంపీడీవో చంద్రశేఖర్



తాడేపల్లిగూడెం జులై 21 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకీ మెరుగుపరిచే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యంగా కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్వహణ పై శ్రద్ధ పెట్టాలని తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి చంద్రశేఖర్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సిఎస్సి (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ) నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటేష్ మాట్లాడుతూ గతంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణకు ఎలా అవగాహన కల్పించామే అదేవిధంగా సి ఎస్ ఎల్ కార్యాలయాల వద్ద మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్డబ్ల్యుఎస్ ఏఈ బి.రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలని ఇప్పటికే 98% ఆ కార్యక్రమం విజయవంతమైందని సిఎస్ఎల్ నిర్వహణ మెరుగ్గా ఉంటే ఆ రెండు శాతం కూడా ఇబ్బంది లేకుండా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ తల్లాప్రగడ రవిచంద్ర, ఎం ఆర్ సి ఎం రవి కిరణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అస్సాం రాష్ట్రానికి చెందిన యువకుడు అదృశ్యం..!!

**- సమాచారం ఉన్నవారు పెందుర్తి పోలీసులను సంప్రదించండి..**

( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటనరవ గ్రామ సమీపంలో ఉన్న జయలక్ష్మి వెల్డింగ్ షాప్ వద్ద అదృశ్యమైన అస్సాం రాష్ట్రానికి చెందిన యువకుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.అస్సాం రాష్ట్రం, బార్పేట జిల్లా, బాఘ్‌బోర్ సబ్ డివిజన్, ఖోలాబందా ఎన్.సి. గ్రామానికి చెందిన నిషాన్ అలీ (వయస్సు 21 సంవత్సరాలు) తన తండ్రి అబబర్ అలీతో కలిసి ప్రభుత్వ పాఠశాలలకు ల్యాబ్ మెటీరియల్ సరఫరా చేసే పనుల నిమిత్తం విజయవాడ నుండి విశాఖపట్నం ప్రాంతానికి వచ్చాడు.07-07-2026 తేదీన మధ్యాహ్నం సుమారు 1.00 గంటల నుండి 2.00 గంటల మధ్య, సబ్బవరం నుండి గాజువాక వైపు వెళ్తున్న సమయంలో కోటనరవ గ్రామ సమీపంలోని జయలక్ష్మి వెల్డింగ్ షాప్ వద్ద వాహనాన్ని సహజ అవసరాల నిమిత్తం ఆపారు. అనంతరం ప్రయాణం కొనసాగించిన తర్వాత నిషాన్ అలీ వాహనంలో లేదని గుర్తించి, తిరిగి సంఘటన స్థలానికి వెళ్లి పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. అనంతరం బంధువులు, పరిచయస్తుల వద్ద కూడా విచారించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించకపోవడంతో 19-07-2026న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెందుర్తి పి .ఎస్ . మిస్సింగ్ కేసు నెంబర్ . 285/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



అదృశ్యమైన వ్యక్తి వివరాలు:
- పేరు: నిషాన్ అలీ
- తండ్రి: అబబర్ అలీ
- వయస్సు: 21 సంవత్సరాలు
- స్వస్థలం: బార్పేట జిల్లా, అస్సాం రాష్ట్రం
- ఎత్తు: సుమారు 5 అడుగులు
- ఛాయ: తెలుపు
- ధరించిన దుస్తులు: నలుపు రంగు టీ-షర్ట్, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్

నిషాన్ అలీ గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే, వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్ -- 9676797314 లేదా దర్యాప్తు అధికారి హెడ్ కానిస్టేబుల్ స్వామి -- 9848462678 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి దర్యాప్తుకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ప్రత్యేక గమనిక:

అదృశ్యమైన నిషాన్ అలీ ఆచూకీ తెలిపి అతడిని గుర్తించడంలో సహకరించిన వారికి, అతని తండ్రి శ్రీ అబబర్ అలీ రూ.20,000/- (ఇరవై వేల రూపాయలు) నగదు బహుమానం అందజేస్తారని తెలియజేశారు.

## తెలుగు భాష, సంస్కృతి వైభవానికి రెండు ప్రతిష్ఠాత్మక ఉత్సవాలు

**-జూలై 25--26న 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' -ఆగస్టు 8--9న**

**'అమరావతి చిత్రకళా వీధి'-కళాకారులు, రచయితలు, ప్రజలందరూ భాగస్వాములు**

**కావాలి-రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి**

విజయవాడ , జులై 21 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు.విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, నృత్య సంగీత కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 'సూర్యోదయ సుప్రభాతం' సంగీత కార్యక్రమం, 'ఆమె మాట -- అక్షర బాట', కవి సమ్మేళనాలు, 'అమ్మమ్మ కథల ముచ్చట్లు', 'నెక్స్ట్ జెన్ తెలుగు' యువతతో చర్చలు, 'నవస్వరం' ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో 'అమరావతి చిత్రకళా వీధి' పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి 800 స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తేజస్వి పొడపాటి పేర్కొన్నారు.జూలై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ నిర్వహణలో జరిగేవి మాత్రమే కాకుండా, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.

## బీసీలపై దాడులు పోయాయి 2029లో మా సత్తా ఏంటో చూపిస్తాం

**వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి , కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు బిల్లే మంజునాథ్**



అనంత పురం జూలై 21నేటి శుభోదయ :వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిసిల మీద దాడులు, భూ కబ్జాలు, హత్యలు మితిమిరిపోతున్నాయి అని వైసిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లా మంజునాథ్ విమర్శించారు.ఇలాగే కొనసాగితే రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గలలో బిసిల సత్తా చూపిస్తాం ... ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గములో అధిక శాతంలో ఉన్న బిసి కులస్తుల లో కురుబలు, బోయలు మీద హత్యలు,దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. రాప్తాడు నియోజకవర్గములో ఈ మధ్య కాలంలో 2024 నుంచి 2026 వరకు అంటే ఈ 2ఏళ్లలో కురుబ,బోయ కులస్తులను ఇద్దరిని హత్య చేశారు. మరికొందరి మీద దాడులు చేశారు.ఈ సందర్భంలో బిసిలకు కురుబ, బోయ కులస్తులకు తెలియజేయడం ఏమనగా మన ఓట్లతో అధికారములోకి వచ్చి మన మీద చేస్తున్న దాడులను హత్యలపై కూటమి ప్రభుత్వన్ని ప్రశ్నించాలి మన సత్తా చూపించాలి.. అందరూ ఒక్కటై త్వరలో అనంత నడిబొడ్డున " కూటమి ప్రభుత్వంలో బిసిల అణచివేత " మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిల్లే మంజునాథ్ .. తెలుగుదేశం పార్టీ ప్రతిసారి ఎన్నికలో తప్పుడు హామీలు ఇచ్చి బీసీలను ఓటు రూపంలో వాడుకోవడం అధికారములోకి వచ్చాక బీసీలను అణచివేయడం ఆనవాయితిగా వస్తుంది..తెలుగుదేశం పార్టీకి బిసిల సత్తా చూపిద్దాం రండి కదిలిరండి .రాప్తాడు నియోజకవర్గములో 2029 ఎన్నికల్లో మా బిసిల సత్తా ఏంటో చూపిస్తామని బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లే మంజునాథ్ హెచ్చరించారు.

## ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు

**ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ (ఐడబ్ల్యూటీసీ)**

**వేదికగా జైపూర్ లో అవార్డు అందుకున్న మంత్రి కందుల దుర్గేష్**

**-డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని వెల్లడి**




రాజస్థాన్(జైపూర్), అమరావతి, జులై 21 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రాజస్థాన్ లోని జైపూర్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో అరుదైన గౌరవం దక్కింది. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు, ఈ రంగంలో కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు గాను ఏపీకి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు పురస్కారం లభించింది.ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సోమవారం రాత్రి జైపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని ఏపీ సర్కార్ పర్యాటకాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. "దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు ఏపీయే ఫేవరెట్ స్పాట్ గా ఉండేలా చేస్తామన్నారు. అందమైన లోకేషన్లు.. అద్భుతమైన ఆతిథ్యం తో పాటు రాబోయే రోజుల్లో ఏపీని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఇటీవలే కేరళలో గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ అందించిన బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డు మరియు గోవాలో ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో అరకు కు మోస్ట్ ఇన్ స్టాగ్రామబుల్ ల్యాండ్ స్కేప్ అవార్డును అందుకున్నామని, ఇప్పుడు మరో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ..

**నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం..'**

**- రాజానగరం నియోజకవర్గంల ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**

**- 'మన ఊరు - మన ఎమ్మెల్యే - మన పల్లెబాట' కార్యక్రమశీలో ఎమ్మెల్యే..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);'ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ.. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని.. రాజానగరం నియోజకవర్గంల ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సుపరిపాలనను ప్రతి ఇంటికి చేరువ చేయడమే లక్ష్యంగా, రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ 'మన ఊరు - మన ఎమ్మెల్యే - మన పల్లెబాట' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంగళవారం కొరుకొండ మండలం రాజవరం, కనుపూరు, నర్సాపురం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. 'గ్రామాభివృద్ధే - రాష్ట్రాభివృద్ధికి పునాది' అనే నినాదంతో, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి ఆయన నేరుగా గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నరసాపురం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విద్య, వైద్యం, త్రాగునీరు, వ్యవసాయం, సంక్షేమ పథకాలు వంటి వివిధ అంశాలపై ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందాలని, ఏ ఒక్కరూ సంక్షేమానికి దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. అనంతరం నర్సాపురం గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల నిర్వహణలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు. భవిష్యత్తులో గ్రామంలో చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యం. పల్లెల్లో ప్రతి సమస్యను పరిష్కరించడమే నా బాధ్యత. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, రాజానగరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఈ పల్లెబాట కార్యక్రమం ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతాయి' అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## - మన వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వద్దు

**- పాడి రైతులు ఆగ్రహం, ఎం. నాగులపల్లిలో**

**నిరసన, మోడీ, ట్రంప్ దిష్టి బొమ్మ దహనం**




ద్వారకా తిరుమల (ఎం.నాగులపల్లి), నేటి శుభోదయ ::: మన రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి నాశనం చేసే అమెరికాతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం -పాడి రైతుల సంఘం ఆధ్వర్యంలో ఎం. నాగులపల్లిలో పాడి రైతులు మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వాణిజ్య ఒప్పందంపై పాడు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వ్యవసాయాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్ర మోడీ ప్రభుత్వం తహతహలాడుతోందని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ఈ ఒప్పందం అని విమర్శించారు. అమెరికా నుండి ఎటువంటి సుంకాలు లేకుండా పాలు,పాలు పదార్థాలు, కోడి మాంసం, మొక్కజొన్నలు, పత్తి, సోయాబీన్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయ్యి దేశీయంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల స్వయం సమృద్ధిని, సార్వభౌమాధికారాన్ని నాశనం చేసి ప్రపంచ కార్పొరేట్ సంస్థలకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగిపోయి వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికే దేశంలో రైతులు వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు పెట్టవద్దని డిమాండ్ చేశారు. సంతకం చేస్తే ఎఫ్ టి ఏ కు వ్యతిరేకంగా మరో చారిత్రాత్మక రైతు ఉద్యమానికి సమాయత్తం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, పాడి రైతులు జి.రాంబాబు,పి.నాగరాజు, టి.పూర్ణచంద్రరావు,ఎం. వెంకటేశ్వరరావు, ఎన్. వెంకట్రావు, ఎన్.సుబ్బారావు, జి. చంద్రరావు, ఎన్.బాపనయ్య, వి.శివ నాగరాజు, వి. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రధాన మంత్రి పంటల భీమ యోజన' పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి'

**- వరి పంటకి ఒక ఎకరా కి రూ. 570 లు, మినుము పంటకి రూ. 300 లు పంట భీమ చెల్లించుకుంటే ప్రయోజనం..! - జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశవరరావు**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)'ప్రధాన మంత్రి పంటల భీమ యోజన' పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, 'ప్రతి ఒక్క రైతు ఈ సీజన్లో వరి పంటకి ఒక ఎకరా కి రూ. 570 లు, మినుము పంటకి రూ. 300 లు పంట భీమ చెల్లించుకుంటే ప్రయోజనం చేకూరు తుందని జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశవరరావు తెలియజేశారు.మంగళవారం కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. కోరుకొండ వ్యవసాయ శాఖ ఏ.ఫై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశవరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రైతు కూడ వరి పంటకి ఒక ఎకరా కి 570 రూ. ,మినుము పంటకి 300 రూ . పంట భీమ చెల్లించుకోవలసిందిగా తెలియజేశారు. వరి పంటకు ఒక ఎకరానికి 33,000 లు, - నుంచి 37,000 లు - భీమ వర్తిస్తుశీదని తెలిపారు. అలాగే కార్యక్రమంలో కోరుకొండ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావం వల్ల పంట నష్టం జరిగే అవకాశం ఉందని, దీని దృష్ట్యా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 'ప్రధాన మంత్రి పంటల భీమ యోజన' ను ఉపయోగించుకోవలసిందిగా కోరారు. వరి భీమ చెల్లించడానికి ఆగష్టు 15 వరకు వుందని, మినుము పంటకు ఈ నెల ఆఖరు వరకు వుందని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ సాగు ఆధునిక, ఆరోగ్య పద్ధతులను రైతులకు వివరించారు. వివిధ రకాల సాగు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ.తులసి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జయ హనుమంత జ్ఞాన గుణ సాగర

**- శ్రీగిరిలో అభయాంజనేయ స్వామివారి ఆగమన ఆరాధనోత్సవాలకు శ్రీకారం**

**- భక్తులచే 108 సార్లు చాలీసా పారాయణ - నేత్ర పర్వంగా శ్రీవారి ఊంజల సేవ**



ఒంగోలు, నేటి శుభోదయ ::: శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు మంగళ వారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి వారికి విశేష అర్చన అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ నేత్ర పర్వంగా నిర్వహించారు, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు మధుర గాయకులు వి వి ఎస్ వినోద్ కుమార్ గాత్ర కచేరీ భక్తులకు వీనుల విందు చేసింది, హనుమత్సంబంధమైన పలు కీర్తనలను వినోద్ కుమార్ మృదు మధురంగా ఆలపించి భక్తులను తన్మయులను చేశారుశ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు గాయకుడు వినోద్ కుమార్ ను ఘనంగా సత్కరించారు.



భక్తులకు తీర్ధ ప్రసాదాలను అంద చేశారు,అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలలో భాగంగా 22 వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు హనుమత్ యాగం, పూర్ణాహుతి, సాయంత్రం 6.30 లకు భక్తులచే విష్ణు సహస్ర నామ పారాయణ జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి




నేలకొండపల్లి, నేటి శుభోదయ :::ప్రమాదవశాత్తు తో విద్యుత్ షాకు కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన అనంతు వీరయ్య (55) అనే రైతు మంగళవారం పొలం వద్ద మోటార్ స్విచ్ వేసేందుకు వెళ్లాడు. సాగు నీటి సరఫరా కోసం స్విచ్ వేస్తుండుగా ప్రమాదవశాత్తు షాక్ కు గురైయ్యాడు. దీంతో అక్కడిక్కడే రైతు మృతి చెందాడు. మృతుడు కు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం ను స్తానిక ప్రభుత్వ హస్పిటల్ లో పోస్టుమార్డమ్ ను నిర్వహించారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న ఇంద్రకీలాద్రి



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):-శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలావేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి పై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు 29 సారె బృందాలు రాగా, 10,856 మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్న దేవాదాయ ట్రిబ్యునల్ చైర్ పర్సన్




విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయం):-ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ ట్రిబ్యునల్ద నూతన చైర్పర్సన్గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ జిల్లా జడ్జి శ్రీమతి ఎ. భారతి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. నూతన చైర్పర్సన్ కు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్, చైర్పర్సన్ వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం నూతన చైర్పర్సన్కు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసారు.

# క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకునేందుకు రైతుగా మారిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**-గుడ్లవల్లేరులో 11 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని స్వయంగా వ్యవసాయం ప్రారంభించిన ఎమ్మెల్యే..-నారుమడి, పొలం పనుల్లో స్వయంగా పాల్గొన్న రాము.-రైతుల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలును ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకే ఈ నిర్ణయమన్న ఎమ్మెల్యే -క్షేత్రస్థాయి పనితీరే పరిపాలనకు సార్థకత: సీఎం చంద్రబాబు -వ్యవసాయం చేయడం ఎంతో ఎంజాయ్ చేస్తున్నాను చాలా తృప్తిగా ఉంది:ఎమ్మెల్యే రాములి -మూడు ఎకరాల్లో ఆర్గానిక్, ఎనిమిది ఎకరాల్లో బిపిటి వరి సాగు చేస్తున్నట్లు వెల్లడి**





గుడివాడ, జులై 21( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వ్యవసాయ రంగంలో క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవాలనే లక్ష్యంతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వయంగా రైతు పాత్రలోకి దిగి అందరి దృష్టిని ఆకర్షించారు. వ్యవసాయ, సాగునీటి శాఖల పనితీరును మెరుగుపరచాలంటే రైతుల నిజమైన కష్టాలను అనుభవపూర్వకంగా తెలుసుకోవాల్సిందేనని భావించిన ఎమ్మెల్యే రాము ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో క్వాలిటీ ఫీడ్స్ అధినేత కోగంటి ఆంజనేయులకు చెందిన గుడ్లవల్లేరు మండలం కూచికాయలపూడి గ్రామంలోని 11 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని స్వయంగా వ్యవసాయం ప్రారంభించారు. కౌలుకు తీసుకున్న భూమిలో ఎమ్మెల్యే రాము స్వయంగా నారుమడి ప్రక్రియను పూర్తి చేశారు. పొలం గట్లు మెరకచేయడం, విత్తనాలు వెదజల్లడం వంటి వ్యవసాయ పనుల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు.కౌలు రైతుల సమస్యలు, లాభనష్టాలు, ప్రభుత్వ పథకాల అమలు విధానం వంటి అంశాలను ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కోగంటి ఆంజనేయులు కౌలుకు సంబంధించిన అధికారిక కౌలు కార్డును సిద్ధం చేశారు.ఎమ్మెల్యే రాము ఆలోచన, సంకల్పాన్ని గుడివాడలో జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పనిచేస్తేనే పరిపాలనలో సార్థకత ఉంటుందని ఈ చర్య ద్వారా స్పష్టమవుతుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కౌలు గుర్తింపు కార్డును సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే రాముకు అందించారు.తాను వ్యవసాయం చేయడానికి గల కారణాలను ఎమ్మెల్యే రాము ప్రజా వేదిక కార్యాలయంలో తనను కలిసిన పత్రికా ప్రతినిధులకు వివరించారు.గుడివాడ వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతుల సమస్యలను లోతుగా అర్థం చేసుకోవాలని నిర్ణయించానని చెప్పారు. రైతులు, అధికారులు చెబుతున్నా పూర్తిస్థాయి సమస్యలు బయటకు రావడం లేదని, అందుకే వ్యవసాయంలో ప్రత్యక్షంగా ఇన్వాల్వ్ అవుతున్నానని తెలిపారు. వ్యవసాయ పద్ధతుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలనుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతానికి 3 ఎకరాల్లో మైసూరు మల్లిక ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్నానని, మిగిలిన 8 ఎకరాల్లో బిపిటి వరి పంటను సాగు చేస్తున్నానని వెల్లడించారు. అన్ని పద్ధతులు ఒకేసారి చేయకుండా అవగాహన పెంచుకుని ఒక్కొక్కటిగా ప్రయత్నిస్తున్నానని అన్నారు. తన ప్రయత్నం సక్సెస్ అయితే ప్రత్యామ్నాయ పంటలపై మరింత మంది రైతులు ఆసక్తి చూపుతారని ఆశిస్తున్నానని చెప్పారు.27 సంవత్సరాలు అమెరికాలో సక్సెస్ అయిన అనంతరం పుట్టిన ఊరుపై ప్రేమతో గుడివాడకు తిరిగి వచ్చానని తెలిపారు. కుటుంబంలో ఎవరూ రైతులు లేకపోయినా అధికారుల సలహాలు, పార్టీలోని రైతుల సూచనలతో వ్యవసాయ పరిజ్ఞానం పెంచుకుంటున్నానని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఒకలా, అధికారులు మరోలా చెబుతున్నారని, అసలు వాస్తవాలు తెలుసుకోవడమే తన ప్రయత్నమని పేర్కొన్నారు.వ్యవసాయం చేయడం ఎంతో ఎంజాయ్ చేస్తున్నానని, మానసికంగా చాలా తృప్తిగా ఉందని చెప్పారు. డీఏపీకి ప్రత్యామ్నాయంగా టీఎస్పీని కొంచెం మోతాదులో యూరియా కలిపి వాడతానని తెలిపారు. మాటలు చెప్పడం వేరు, ఆచరించి చూపించడం వేరు అన్న ఉద్దేశంతోనే తాను ముందుకు వచ్చానని అన్నారు.వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పడుతున్న కష్టాలు తెలుసుకునేందుకే ముందుగా ఆసక్తి చూపానని ఎమ్మెల్యే రాము వివరించారు. వ్యవసాయ పనులపై సమీక్షల్లో ఇరిగేషన్, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం లేకపోవడాన్ని గుర్తించానని చెప్పారు. ఈసారి గుడివాడ నియోజకవర్గంలో ఒంతుల వారీగా నీటి విడుదలలికు షెడ్యూల్ సిద్ధం చేశామని తెలిపారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందిస్తున్నామని, అయినా సమన్వయ లోపంతో ముందుగా నారుమళ్లు వేయడం వల్ల కొన్నిచోట్ల నీటి సమస్య ఏర్పడిందని అన్నారు. ఇదే ముందుగా చర్చించి ఉంటే సమస్య వచ్చేది కాదని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.ఎమ్మెల్యే రాము చేస్తున్న ప్రయత్నాన్ని కూటమి శ్రేణులతో పాటుగా, రైతులు, సాధారణ ప్రజానీకం అభినందిస్తున్నారు.

## ప్రజల ఆరోగ్యం, నగర సౌందర్యం పెంపొందించే విధంగా చర్యలు వియంసీ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):-ప్రజల ఆరోగ్యం, నగర సౌందర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని మహాత్మా గాంధీ రోడ్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్, కనకదుర్గ వారధి పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారించాలని, ప్రధాన రహదారులు, ఫ్లైఓవర్ల పరిసరాల్లో సాధ్యమైనంత మేరకు మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అధిక వాహన రద్దీ కారణంగా ఈ ప్రాంతాల్లో వాయు కాలుష్యం, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నగర వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చవచ్చని పేర్కొన్నారు. పచ్చదనం పెరగడం వల్ల నగర సౌందర్యం మెరుగుపడటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో దోహదపడుతుందని అన్నారు. నగర పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఫ్లైఓవర్లపై వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ జాలీలు, వాటర్ ఇన్లెట్లు దుమ్ము, మట్టి, చెత్తతో మూసుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహిస్తున్న పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు కనిపిస్తే వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రధాన రహదారులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.అనంతరం కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్యం పాఠశాల సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్లో అందిస్తున్న ఆహార నాణ్యతను ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. త్రాగునీటి సరఫరా, వంటకు వినియోగించే నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. క్యాంటీన్ను ప్రతిరోజూ నిర్ణీత సమయానికి ప్రారంభించి, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో మొబైల్ నెట్వర్క్ సేవలు మెరుగుపరచాలి. ఐ టి డి ఎ పివో పి ఓ శుభమ్ నొక్వాల్



చింతూరునేటి శుభోదయ): మారుమూల గ్రామాలలో మొబైల్ నెట్వర్క్ సేవలు మెరుగుపరచాలని ఐటిడిఏ పిఓ శుభమ్ నొక్వాల్ నెట్వర్క్ ఆపరేటర్లను కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటిడిఏ చింతూరు ప్రాజెక్ట్ అధికారి శుభం నోఖ్వాల్, తన కార్యాలయంలో జియో , ఎయిర్టెల్ , బిఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు , గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో మొబైల్ నెట్వర్క్ సేవల ప్రస్తుత పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో తగిన మొబైల్ నెట్వర్క్ అందుబాటులో లేకపోవడం వల్ల విద్య, వైద్య, బ్యాంకింగ్, అత్యవసర సేవలు, అలాగే ఇతర ఆన్లైన్ ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టెలికాం సంస్థల ప్రతినిధులు వివరించారు.దీనిపై స్పందించిన ప్రాజెక్ట్ అధికారి, నెట్వర్క్ సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ముఖ్యంగా 5+ సేవలను దశలవారీగా విస్తరించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచించారు.టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన అనుమతులు, భూకేటాయింపు లేదా ఇతర ప్రభుత్వ సహకారం అవసరమైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, డిజిటల్ సేవలు ప్రతి గ్రామానికి చేరేలా సమన్వయంతో చర్యలు కొనసాగిస్తామని ప్రాజెక్ట్ అధికారి స్పష్టం చేశారు.

## గూడ్స్ వెహికల్ లో ఘాట్ రోడ్డు లో ప్రయాణాలు నిషేధం.



చింతూరు ఎస్సై సంతోష్ కుమార్ చింతూరు నేటి శుభోదయ): గూడ్స్ వెహికల్ లో ఘాట్ రోడ్లో ను, మామూలు రోడ్లలోనూ ప్రయాణాలు నిషేధమని, అలా ప్రయాణిస్తే కేసులు తప్పవని చింతూరు ఎస్ఐ పేర్కొన్నారు.పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ,చింతూరు ఏ ఎస్ పి హేమంత్ , సి ఐ గోపాలకృష్ణ వారి ఆదేశాల మేరకు కూలీలు గాని, విహారయాత్రలకు వచ్చేవారు గానీ గూడ్స్ వెహికల్ లో ప్రయాణించిన వెహికల్ సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు . చింతూరు నుండి మారేడుమిల్లి వెళ్ళ ఘాటి రోడ్లో ఎట్టి పరిస్థితుల్లో గూడ్స్ వెహికల్ లో మనుషుల్ని ఎక్కి ప్రయాణించవద్దని తెలియజేశారు ., గత రెండు నెలల్లో చింతూరు ఘాట్ రోడ్ లో వివిధ ప్రాంతాలలో గూడ్స్ వెహికల్ ప్రమాదాలు సంభవించినాయని అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు మరణించడం జరిగిందని తెలిపారు .ప్రతి ఒక్కరూ రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించాలని తెలిపారు.


## విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు



చింతూరు నేటి శుభోదయ):పోలవరం జిల్లా, చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని పి. సాయి మేఘన, జిల్లా స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి లి"షైనింగ్ స్టార్ అవార్డు"లిను జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ , ఎమ్మెల్యే ఎం. శిరీష చేతుల మీదుగా, ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్య సంచాలకులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం కళాశాలకు గర్వకారణమైంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థిని పి. సాయి మేఘన సాధించిన ఈ ఘనత కళాశాల అధ్యాపకుల అంకితభావానికి, తల్లిదండ్రుల సహకారానికి, విద్యార్థిని కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు విద్య, క్రీడలు, ఇతర రంగాలలో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పి. సాయి మేఘనను అభినందిస్తూ, ఆమె భవిష్యత్ విజయాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పతి ఇంట్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి

**"క్యాచ్ ది రైన్--2026"లో ప్రజలంతా భాగస్వాములు కావాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):-వర్షపు నీటిని ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో శాఖాధిపతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అన్నారు.కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జలశక్తి మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "క్యాచ్ ది రైన్--2026" కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర ప్రజలు చురుకుగా పాల్గొని వర్షపు నీటి సంరక్షణకు తోడ్పడాలని, ఈ కార్యక్రమం వర్షపు నీటి సంగ్రహణ, భూగర్భ జలాల పెంపు, చెరువులు, కుంటలు, కాలువల పునరుద్ధరణతో పాటు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించాలని శాఖధిపతులను ఆదేశించారు. ప్రతి ఇంటిలో, అపార్ట్మెంట్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, వాణిజ్య సముదాయాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వర్షపు నీటిని కాలువల్లోకి వదిలేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు తాగునీటి భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు.విజయవాడలో వర్షపు నీటి సంరక్షణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలు, జల్ సంవాద్ అనే పేరు తో సమావేశాలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని నీటి వనరుల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంగ్రహణకు సంబంధించిన ఉత్తమ కార్యక్రమాలను ప్రజలకు పరిచయం చేస్తూ ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయ వ్యయాన్ని తగ్గించడం, ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రామ్‌నాథ్ ఠాకూర్



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):- పార్లమెంట్ లో కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ ఉప-మిషన్ యాంత్రీకరణం పథకం అమలు పై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖన ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇస్తూ రాష్ట్రాలు వ్యవసాయ యాంత్రీకరణ ఉప-మిషన్‌తో పాటు వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖకు సంబంధించిన అన్ని పథకాలను కలుపుకొని ఏకీకృత వార్షిక కార్యాచరణ ప్రణాళికలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, వ్యక్తిగత యాజమాన్య ప్రాతిపదికన వ్యవసాయ యంత్రాలు, పరికరాల కొనుగోలుకు రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల లబ్ధిదారుల రాష్ట్రాల వారీ, సంవత్సరాల వారీ వివరాలు వెల్లడించారు.పథకం అమలుపై సమగ్ర ప్రభావ మూల్యాంకనాన్ని నీతి ఆయోగ్ అభివృద్ధి పర్యవేక్షణ, మూల్యాంకన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2025లో విడుదలైన అధ్యయన నివేదిక ప్రకారం, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు అద్దె యంత్రాల లభ్యతను పెంచడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా మారిందని స్పష్టం చేసారు. వ్యవసాయ యాంత్రీకరణ వల్ల ఉత్పాదకత పెరగడంతో పాటు శ్రమ వ్యయం కూడా గణనీయంగా తగ్గుతోందని నివేదిక పేర్కొందన్నారు.అలాగే, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సమాచారం ప్రకారం, దేశంలో వ్యవసాయ విద్యుత్ లభ్యత 1971-72లో హెక్టారుకు 0.372 కిలోవాట్ల నుంచి 2021-22 నాటికి హెక్టారుకు 3.045 కిలోవాట్లకు పెరగడం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వేగంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం వివరించింది రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉండటం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు కూడా వ్యవసాయ యాంత్రీకరణ ప్రయోజనాలు పొందేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రైతులు ఈ పథకాన్ని మరింత విస్తృతంగా వినియోగించుకుని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## మహిళా శక్తిని బలోపేతం చేస్తున్న కూటమి ప్రభుత్వం 40 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందచేసిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):-ముప్పై సంవత్సరాల క్రితమే మహిళా శక్తిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుర్తించి వారిని మరింతగా బలోపేతం చేయడానికి డ్వాక్రా వ్యవస్థను ఏర్పాటు చేశారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మహిళలను మరింగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.మంగళవారం ఉదయం తూర్పులోని 11వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్‌లోని ఆయా విభాగాల అధికారులను గద్దె ఆదేశించారు. అనంతరం పూజిత మహిళా సోసైటీ ఆఫ్ సోషల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారు ఆర్థికంగా నిలబడేలా చేయడానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 30 సంవత్సరాల క్రితమే మహిళా శక్తిని నమ్మి వారితో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. డ్వాక్రా సంఘాలు సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు 40 మందికి కుట్టుమిషన్లు అందచేశారని వారికి సాంకేతికంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, దానిని దాటుకుని వెళుతూ మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలోముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, నాదెళ్ల రాజేష్, పేరేపి ఈశ్వర్, దయాల శీరీషా గాంధీ, దుర్గా ప్రసాద్, భాగం సాయి ప్రసాద్, కర్ణ రమేష్, కోడూరు ఆంజనేయ వాసు, షేక్ నాగుర్, శివలక్ష్మి, వల్లూరు సాంబశివరావు, కార్పొరేషన్ సీడీవో ఉమామహేశ్వరి, వీఎంసీ టీఈ సుజాత, ఎన్జీవో కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో -4 పథకం ద్వారా 42,000 ఫీజు చెల్లించి విద్యార్థిని చదువుకు చేయూత నిచ్చిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కండ్రిక ప్రాంతానికి చెందిన ఉప్పులూరి సాయి శివ లాస్య శ్రీ అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తన సొంత నిధుల నుంచి ా-4 పథకం ద్వారా 42,000 ఫీజును అందజేసి విద్యాభ్యాసానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కావడం బాధాకరమన్నారు, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశం కల్పించడం సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆర్థిక సమస్యలు వారి కలలకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో తన వంతు సహాయాన్ని అందిస్తున్నానని ఉమా తెలిపారు. అవసరమైన ప్రతి సందర్భంలో విద్యార్థులకు అండగా ఉంటానని, విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు.విద్యార్థిని ఉప్పులూరి సాయి శివ లాస్య శ్రీ, ఆమె కుటుంబ సభ్యులు తమ క్లిష్ట పరిస్థితిని అర్థం చేసుకుని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫీజు కోసం 42,000 అందించి చదువును కొనసాగించే అవకాశం కల్పించిన బొండా ఉమా కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, దేవరపు మాల్యాద్రి, గద్దం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టాభిరామ్ ను సన్మానించిన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ బల్లా పల్లవి



అనంత పురం బ్యూరో జూలై 21 నేటి శుభోదయ:అనంతపురం నగరానికి విచ్చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టాభి రామ్ కు శాలువాతో సత్కరించారు.అనంతపురం మార్కెట్ యార్డ్‌లో రైతుల సౌకర్యార్థం మరుగుదొడ్ల ఏర్పాటు అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు .దీనిపై సానుకూలంగా స్పందించిన పట్టాభిరామ్ మార్కెట్ యార్డ్‌లో రైతుల కోసం మరుగుదొడ్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది 4.37 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 21 (నేటి శుభోదయ):- బిఆర్ టిఎస్ రోడ్డులోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం 31, 36వ డివిజన్‌లకు చెందిన 5 గురు లబ్ధిదారులకు 4 లక్షల 37 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు, ఆర్థిక ఇబ్బందులతో చికిత్సను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.సెంట్రల్ నుంచి ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన ప్రతి దరఖాస్తును ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి, ప్రభుత్వం నుంచి అందే ప్రతి సంక్షేమ పథకం అర్హులకు చేరేలా కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఉమా అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని, వైద్యం కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు లేకుండా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.సియంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటికే సెంట్రల్ లోని వందలాది కుటుంబాలు లబ్ధి పొందాయని, అవసరమైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందే వరకు తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఉమా తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సహాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, బొండా ఉమా కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, 31వ డివిజన్ అధ్యక్షులు గద్దం శ్రీనివాస్, ఇంచార్జ్ కాకొల్లు మహేంద్ర నాథ్(బాబీ), ప్రధాన కార్యదర్శి దాట్ల రాజేష్, 36వ డివిజన్ అధ్యక్షులు మద్దినేని సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ సింగ్ , లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అనకాపల్లి టౌన్ పోలీసుల సమర్థవంతమైన చర్యలు..!!

**- బైక్ చోరీ కేసులో నిందితుడికి 5 నెలల జైలు శిక్ష...**

**- మరొక దొంగతనం కేసులో పాత నేరస్థుడి అరెస్ట్, రెండు బైక్‌లు స్వాధీనం**



( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో పోలీసులు వేగవంతమైన చర్యలు చేపట్టారు. ఒక కేసులో నిందితుడికి కోర్టు ద్వారా శిక్ష పడేలా చేయగా, మరొక కేసులో పాత నేరస్థుడిని అరెస్ట్ చేసి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

1. బైక్ చోరీ కేసులో నిందితుడికి 5 నెలల జైలు శిక్ష:2.గత ఫిబ్రవరి 10, 2026న అనకాపల్లి శ్రీరామ్‌నగర్‌కు చెందిన దిగుమర్తి శివప్రసాద్ తన ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ 220 బైక్ (ఏపీ 39 ఎస్ ఫ్ 4993) చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ సీఐ ఆదేశాల ప్రకారం క్రైమ్ నెంబర్ 37/2026 యూ /ఎస్ 303(2) బి న్ ఎస్ కింద కేసు నమోదు చేశారు.దర్యాప్తు అండ్ అరెస్ట్: ఈ కేసును టౌన్ ఎస్ఐ కే.సంతోష్ వేగవంతంగా దర్యాప్తు చేసి, తూర్పుగోదావరి జిల్లా రావులపాలేనికి చెందిన పసుపులేటి రాము (25) ప్రస్తుతం వాంబే కాలనీ, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ నివాసి అనే నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు తీర్పు: పోలీసులు కోర్టులో బలమైన ఆధారాలు సమర్పించడంతో, అనకాపల్లి గౌరవ 11వ ఎ ఎం ఎం కోర్టు జడ్జి శ్రీ ఎ.రమేష్ నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడికి 5 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.2. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో పాత నేరస్థుడి అరెస్ట్ - 2 బైక్‌లు స్వాధీనం: ?గత నెల జూన్ 27న అచ్యుతాపురానికి చెందిన అడిగర్ల శంకర్రావు అనే వ్యక్తి గుజరాత్ వెళ్లేందుకు గాను తన హోండా హార్నెట్ (ఏపీ 39 కే 7716) బైక్‌ను అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద పార్క్ చేయగా చోరీకి గురైంది.వాహనాల తనిఖీల్లో దొరికిన దొంగ: టౌన్ సీఐ ప్రేమ కుమార్ ఉత్తర్వుల మేరకు మంగళవారం పూడిమడక బైపాస్ వద్ద ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు మరియు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో కాకినాడ జిల్లా, తుని మండలం సీతంపేట హంసవరం గ్రామానికి చెందిన షేక్ బషీర్ భాష (24) అనే పాత నేరస్థుడు పట్టుబడ్డాడు.రికవరీ అండ్ రిమాండ్: నిందితుడిని విచారించగా రైల్వే స్టేషన్ వద్ద దొంగిలించిన బైక్‌తో పాటు, గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన మరో గ్లామర్ బైక్ వివరాలను వెల్లడించాడు. అతడి వద్ద నుండి ఈ రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తతరలించారుతనిఖీల్లో పాల్గొన్న సిబ్బంది: ఈ ఆపరేషన్‌లో సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావుతో పాటు పోలీస్ సిబ్బంది సాగర్, టీ.ఎస్.నాయుడు, ఆర్.పి.నాయుడు, సంతోష్‌లను అధికారులు అభినందించారు.అనకాపల్లి టౌన్ పోలీసులకు జిల్లాఎస్పీ అభినందనలు:కేసుల్లో వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితుడికి కోర్టు ద్వారా శిక్ష పడేలా చేసినందుకు, అలాగే పాత నేరస్థుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ జీ.ప్రేమ కుమార్ మరియు పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నేరాల నియంత్రణలో ఇదే తరహా ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు.

## వైన్ షాప్ దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష

**- 2 సంవత్సరాలు 6 నెలల జైలు శిక్ష -- ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా**



( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) శ్రీకాకుళం జిల్లా కొత్తూరు పోలీసు స్టేషన్ పరిధిలోని మెట్టూరు గ్రామంలో జరిగిన వైన్ షాప్ దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు కొత్తూరు న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు కొత్తూరు పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం, కొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలోని నాయుడు వైన్ షాప్‌లో గుమస్తాగా పనిచేస్తున్న బుక్తా అనంత కుమార్ 03-03-2019 తేదీన ఫిర్యాదు చేశారు. 02-03-2019 రాత్రి సుమారు 9.30 గంటలకు షాప్ మూసివేసి వెళ్లగా, మరుసటి రోజు ఉదయం 9.00 గంటలకు వచ్చి చూడగా షాప్ తాళాలు పగులగొట్టి, అందులో ఉన్న రూ.1,87,170 విలువైన 32 బాక్సుల మద్యం సీసాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తూరు ఎస్.ఐ. వై. రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసిన ఎస్.ఐ. ఎం. ప్రవళిక నిందితులపై చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు.విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్. నాగభూషణం వాదనలు వినిపించారు. కేసులో నిందితులైన సవర మల్లేష్, సవర మొఖలింగం, సవర సూర్యంలపై అభియోగాలు రుజువయ్యాయని కోర్టు నిర్ధారించింది.దీంతో కొత్తూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గౌరవ కందికట్ల రాణి 21-07-2026 తేదీన తీర్పు వెలువరించారు. నిందితుల ముగ్గురికి 2 సంవత్సరాలు 6 నెలల జైలు శిక్ష విధించడంతో పాటు, ప్రతి ఒక్కరికి రూ.10,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.

## విసిఎస్‌సి (వి సీ ఎస్ సీ )కి బ్యాంక్ ఆఫ్ బరోడా సిఎస్ఆర్ (సీ ఎస్ ఆర్ ) ఆర్థిక సాయం

**- మరియు ఈసీ (ఈసీ ) త్రైమాసిక సమీక్షా సమావేశం నిర్వహణ..**




( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వి సీ ఎస్ సీ ) మంగళవారం ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తన 119వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, విశాఖపట్నంలో ప్రజారక్షణ, నిఘా వ్యవస్థను బలోపేతం చేయడానికి 50 సిసిటివి (సీసీటీవీ ) కెమెరాల ఏర్పాటుకై 8.50 లక్షల సిఎస్ఆర్ (సీ ఎస్ ఆర్ ) ఆర్థిక సహాయాన్ని అందించింది.పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో,నగర పోలీసు కమిషనర్ డ్రా .శంఖబ్రత భాగ్చి, ఐ.పీ.ఎస్., సమక్షంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ జనరల్ మేనేజర్ మరియు రీజినల్ హెడ్ లీనా గోహైన్, ఎజిఎమ్ అండ్ డిప్యూటీ రీజినల్ హెడ్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ మరియు మార్కెటింగ్ బృందంతో కలిసి చెక్కును లాంఛనంగా అందజేశారు.ప్రజా భద్రత కోసం చేపట్టిన ఈ కీలకమైన కార్యక్రమంలో భాగస్వామి అయినందుకు బ్యాంక్ ఆఫ్ బరోడాకు విసిఎస్‌సి (వి సీ ఎస్ సీ ) తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సిసిటివి కెమెరాల ఏర్పాటుతో నిఘా సామర్థ్యం మరింత పెరిగి, నగర పౌరులకు సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొంది. చెక్కు అందజేత అనంతరం, గత త్రైమాసికంలో కౌన్సిల్ సాధించిన పురోగతిని సమీక్షించడానికి మరియు రాబోయే నెలల ప్రణాళికపై చర్చించడానికి వి సీ ఎస్ సీ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ ) సమావేశం జరిగింది. వి సీ ఎస్ సీ యొక్క నాలుగు వేదికలను (ఫోరమ్స్ ) బలోపేతం చేయడం, సభ్యత్వాలను విస్తరించడం, వాటాదారుల భాగస్వామ్యాన్ని పెంచడం, సీ ఎస్ ఆర్ భాగస్వామ్యాలను విస్తరించడం మరియు విద్యాసంస్థలు, కార్పొరేట్లు, సమాజంలో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఈ సమావేశానికి విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ అండ్ వి సీ ఎస్ సీ ఛైర్మన్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీస్ ., అధ్యక్షత వహించగా, వి సీ ఎస్ సీ డైరెక్టర్ డాక్టర్ జి. సాంబశివరావు, వి సీ ఎస్ సీ కార్యదర్శి డాక్టర్ సజ్జా పాండురంగ ప్రసాద్లతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మరియు ఫోరమ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్లు, విద్యాసంస్థలు మరియు ప్రజలతో కలిసి పనిచేస్తూ విశాఖపట్నాన్ని మరింత సురక్షితమైన, స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దడానికి వి సీ ఎస్ సీ తన కట్టుబాటును పునరుద్ఘాటించింది.విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వి సీ ఎస్ సీ ) మరియు నగర పోలీసు తరపున,

## శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్‌పై బైండోవర్ చర్యలు..!!

( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించే లక్ష్యంతో పోలీసులు మరో ముందస్తు చర్య చేపట్టారు.పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీ షీటర్ నాగుల మోహన్ సాయి (31 సంవత్సరాలు)ను, పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ పెందుర్తి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రీ ఐ. వెంకట అప్పారావు ఎదుట బైండోవర్ చర్యల నిమిత్తం హాజరుపరిచారు.విచారణ అనంతరం, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అతనితో రూ.2,00,000/- విలువైన బాండ్‌ను ఒక సంవత్సరం కాలానికి అమలు చేయించి, ఆ కాలంలో ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని ఆదేశించారు. అనంతరం అతడిని బైండోవర్ చేశారు.ప్రజలకు విజ్ఞప్తి:పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన ముందస్తు చర్యలు నిరంతరం కొనసాగుతాయి. నేరాలకు పాల్పడే వారు చట్టం నుంచి తప్పించుకోలేరు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, రౌడీయిజం, బెదిరింపులు, భూకబ్జాలు, మత్తు పదార్థాల విక్రయాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు తెలియజేయాలని కోరుతున్నాము. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి.శాంతియుత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజల సహకారంతో నేరరహిత, భద్రమైన పెందుర్తి కోసం పెందుర్తి పోలీసులు నిరంతరం కృషి చేస్తారు.

## దొంగతనాల నియంత్రణకు ప్రజల సహకారం కీలకం

**-- సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ జీడి బాబు**

**- వాహన దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లపై ఉక్కుపాదం -- సీఐ జీడి బాబు**

**హెచ్చరిక- ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటేనే క్రైమ్‌కు అడ్డుకట్ట -- సీఐ జీడి బాబు- వాహన భద్రతపై అప్రమత్తంగా ఉండండి.. చైన్ స్నాచింగ్‌లను అరికట్టేందుకు జాగ్రత్తలు పాటించండి- సీసీ కెమెరాలు, స్టీరింగ్ లాక్స్ వినియోగంతో నేరాలకు చెక్ -- పోలీసుల సూచనలు- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి -- ప్రజలకు విజ్ఞప్తి- క్రైమ్ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మార్గం -- మీడియా సమావేశంలో సీఐ జీడి బాబు**

**- నేరాల నివారణకు ప్రజలే పోలీసుల భాగస్వాములు -- సీఐ జీడి బాబు**



**( నేటి శుభోదయ జులై : 22 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ గాజువాక సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ జీడి బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వాహన దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ఆస్తి నేరాల నివారణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా, గస్తీ, నిందితులపై కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఇళ్ల వద్ద వాహనాలను పార్క్ చేసే ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలను ఎల్లప్పుడూ సురక్షితమైన ప్రదేశాల్లోనే నిలిపివేయాలని తెలిపారు. స్టీరింగ్ లాక్స్, డిస్క్ లాక్స్ వంటి భద్రతా పరికరాలు వినియోగించడం వల్ల దొంగతనాలను గణనీయంగాతగ్గించవచ్చన్నారు. అలాగే వాహనాల్లో నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు వదిలి వెళ్లవద్దని సూచించారు.పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100/112కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల సమన్వయంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, సమాజంలో శాంతిభద్రతలు పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ జీడి బాబు అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే క్రైమ్‌పై మరింత సమర్థవంతంగా ఉక్కుపాదం మోపగలమని ఆయన స్పష్టం చేశారు.**

నేటి శుభోదయ

బుధవారం - 22- జూలై - 2026

# 2 గంటలకో స్కామ్ మెసేజ్

## సందేశం, మెయిల్, సోషల్ మీడియా రూపంలో రాక లింక్ లేకుండా మెసేజ్‌లతో వల వేస్తున్న నేరగాళ్లు బాధితులను మళ్లీ లక్ష్యంగా చేసుకుంటున్న స్కామర్స్



ఆన్‌లైన్ వినియోగం విపరీతంగా పెరుగుతుండడంతో డిజిటల్ మోసాలు ఆందోళనకర స్థాయిలో అధికమవుతున్నాయి. నమ్మదగిన సందేశాలు, డీప్‌ఫేక్ వాయిస్, క్యూఆర్ కోడ్స్‌తో సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారు. తమను మోసగాళు లక్ష్యంగా చేసుకున్న విషయం అత్యధికులు గ్రహించడం లేదు. నష్టం జరిగాకే తాము మోసపోయినట్టు గుర్తిస్తున్నారు. కొత్త నంబర్లు, మెసేజ్‌ల ద్వారా మొబైల్‌కు వచ్చే లింక్స్‌ను తెరవకూడదని ఆర్‌బీఐ, బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు హెచ్చరిస్తున్నా, నేరాల సంఖ్య తగ్గడం లేదు.

రోజుకు సగటున 13 మెసేజ్‌లు..: సందేశం, ఈ--మెయిల్ రూపంలో, సోషల్ మీడియా యాప్స్‌లో సగటున రోజుకు 13 మోసపూరిత (స్కామ్) మెసేజ్‌లను భారతీయులు అందుకుంటున్నారు. అంటే రెండు గంటలకో స్కామ్ సందేశం వస్తోందన్న మాట. ఆన్‌లైన్‌లో ఏది నిజమైనదో, ఏది నకిలీదో తెలుసుకోవడానికి సగటున ఒక్కో వ్యక్తి సంవత్సరానికి 102 గంటలు సమయం వెచ్చిస్తున్నారని ఆన్‌లైన్ ప్రొటెక్షన్ సేవలు అందిస్తున్న అంతర్జాతీయ దిగ్గజం మ్యాకఫీ '2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్'నివేదిక వెల్లడించింది. స్కామర్స్ కేవలం 30 నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే స్కామ్ పూర్తి చేస్తున్నారని తెలిపింది. బాధితులు సగటున రూ.93,915 నష్టపోయినట్టు వెల్లడించింది.

### లింక్ లేకుండానే..

డెలివరీ నోటీసులు, సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, బ్యాంక్ అలర్ట్ వంటి సందేశాలు కస్టమర్ల నమ్మకాన్ని పొందడానికి సైబర్ నేరగాళ్లు ఉపయోగించే సాధారణ వ్యూహాలుగా మారాయి. కొత్త ఎత్తుగడ ఏమంటే అనుమానాస్పద సోషల్ మీడియా సందేశాలలో 20% ఎటువంటి లింక్ లేకుండా వస్తున్నాయి. 66% మంది వినియోగదారులు ఈ లింక్ రహిత సందేశాలకు స్పందించారు. స్కామర్ల ఉచ్చులో పడడానికి ఈ అంశం కూడా కారణమైంది. రోజుకు కనీసం నాలుగు డీప్‌ఫేక్ వీడియోలు తమకు ఎదురవుతున్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. డీప్‌ఫేక్ వీడియోల్లో 65% ఇన్‌స్టాగామ్ వేదికగా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు వాయిస్--క్లోన్ స్కామ్‌ను ఎదుర్కొన్నారు. వాయిస్--క్లోన్ అంటే కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బ్యాంక్ లేదా ప్రభుత్వ అధికారుల గొంతును అనుకరిస్తూ చేసే వాయిస్ మెసేజ్ అన్నమాట.

### అధునాతన వ్యూహాలతో..

సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 70% మంది గత సంవత్సరం తమ సోషల్ మీడియా ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లాయని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను తెరవడంలో ఏడాది క్రితం కంటే ఎక్కువ జాగ్రత్తగా ఉన్నామని 82% మంది చెప్పారు. అయినా, స్కామర్లు అధునాతన వ్యూహాల ద్వారా ఇటువంటి వినియోగదారులను కూడా బోల్తా కొట్టిస్తున్నారు. నెటిజన్లను నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు ఏఐ, అధునాతన డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తూ ఆర్‌బీఐ, బ్యాంకులు, ట్రాయ్, ఆధార్, ఇతర ప్రభుత్వ సంస్థల పేర్లతో సందేశాలను పంపడంతోపాటు సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారు.

### సర్వే గురించి..

**నివేదిక పేరు: మ్యాకఫీ 2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్**

**ఎందుకు: ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి నేరగాళ్ల వైఖరి, ప్రవర్తన, బాధితుల అనుభవాలను తెలుసుకోవడానికి**

**ఏఏ దేశాలు: భారత్, యూఎస్, ఆస్ట్రేలియా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్**

**ఎప్పుడు: 2025 నవంబర్‌లో సర్వే నిర్వహణ**

**ఎవరెవరు: 18 ఏళ్లు పైబడిన 7,592 మందిపై**

### విధానం: ఆన్‌లైన్ వేదికగా

**సర్వేలో పాల్గొన్న 87% మంది భారతీయులు తాము వ్యక్తిగతంగా ఆన్‌లైన్ స్కామ్‌ను అనుభవించామని చెబుతున్నారు.**

**సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా నష్టపోయినట్టు 51% మంది వెల్లడించారు.**

**ఒక స్కామర్ తన లక్ష్యాన్ని మోసం చేసి డబ్బు లేదా సమాచారాన్ని దొంగిలించడానికి పట్టిన సమయం కేవలం 5 నిమిషాలే.**

**ఒక సంవత్సరం క్రితం కంటే నేడు తమ వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో ఉందని 63% మంది నమ్ముతున్నారు.**

**స్కామ్ బాధితుల్లో 24% మందిని ఏడాదిలోపే సైబర్ నేరగాళ్లు మళ్లీ లక్ష్యంగా చేసుకున్నారు.**

**90% మంది మోసపూరిత క్యూఆర్ కోడ్ అందుకున్నారు. స్కాన్ చేయగానే ప్రమాదకర స్థాయికి 38% మంది చేరుకున్నారు.**

**డీప్‌ఫేక్ స్కామ్‌ను గుర్తిస్తామన్న నమ్మకం లేదని, తమను తాము రక్షించుకోలేమని మూడింట ఒక వంతుకుపైగా మంది తెలిపారు.**

# థైరాయిడ్ ఉన్నవారు బరువు తగ్గాలనుకుంటే ఈ సూచనలు పాటించడం తప్పనిసరి

థైరాయిడ్ తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. ఒక్కసారి ఈ సమస్య బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు వాడుతున్నప్పటికీ థైరాయిడ్ తో బాధపడే వారు కొన్ని సమస్యలను ఎదుర్కోవాల్సిందే. వాటిల్లో అధిక బరువును తగ్గించుకోవడం కూడా ఒక్కటి. థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి బరువు తగ్గడం అంత సులభమైన విషయం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా తక్కువ తినండి, ఎక్కువ కదలండి అనే ఫార్ములా అందరికీ పనిచేస్తుందని భావిస్తారు. కానీ హైపోథైరాయిడిజం ఉన్నవారిలో ఈ విధానం కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు ఇస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్య ఉన్నవారు ఆహారం తీవ్రంగా తగ్గిస్తే, శరీరం దానిని ఒత్తిడిగా భావిస్తుంది. అప్పుడు శరీరం ఫ్యాట్‌ను కరిగించడం తగ్గించి సర్వైవల్ మోడ్ లోకి వెళుతుంది.



### హార్మోన్ల పనితీరుపై ప్రభావం..

ఈ పరిస్థితిలో శరీరంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరుగుతాయి. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్‌ల పనితీరు మందగిస్తుంది. టి4 హార్మోన్ నుంచి టి3 హార్మోన్ గా మారే ప్రక్రియ తగ్గిపోతుంది. అదే సమయంలో రివర్స్ టి3 అనే రూపం పెరిగి, ఫ్యాట్ బర్నింగ్ ప్రక్రియను అడ్డుకుంటుంది. ఫలితంగా మెటబాలిజం తగ్గిపోవడం, అలసట పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయి. దీంతో, తక్కువ తిన్నప్పటికీ బరువు తగ్గకపోవడం, మరింత నిరుత్సాహం కలగడం జరుగుతుంది. ఇది క్రమశిక్షణ లోపం కాదు, శరీర సమస్య అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే, శరీరం బరువు తగ్గడాన్ని అడ్డుకోవడం కాదు, అది తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### సరైన పోషకాహారం తీసుకోవాలి..

ఈ సమస్యకు పరిష్కారం ఆహారం తగ్గించడం కాదు, సరైన పోషకాహారం తీసుకోవడమని కూడా వారు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా ప్రోటీన్ సరిపడా తీసుకోవడం ద్వారా మెటబాలిజం మెరుగుపడుతుంది. అలాగే మైక్రోన్యూట్రియెంట్స్ (విటమిన్లు, ఖనిజాలు) హార్మోన్‌ల పనితీరుకు సహాయపడతాయి. ఇక ఒత్తిడిని నియంత్రించడం కూడా చాలా కీలకం. నిరంతరం ఒత్తిడిలో ఉంటే శరీరం సర్వైవల్ మోడ్ లోనే కొనసాగుతుంది. అందుకే సరైన ఆహారం, విశ్రాంతి, మానసిక సమతుల్యత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా థైరాయిడ్ సమస్య ఉన్నవారు త్వరగా ఫలితాలు ఇవ్వగల క్రాష్ డైట్స్‌కి దూరంగా ఉండాలి. శరీరాన్ని పోషించడం ద్వారా మాత్రమే దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. థైరాయిడ్‌కు ఆకలి కాదు, పోషణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# ఓపెన్ ఏఐ మరో షాక్.. ఇక స్మార్ట్ ఫోన్‌లకు చెక్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తన నూతన ఆవిష్కరణలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ సాఫ్ట్‌వేర్ వరకే పరిమితమైందనుకుంటున్న ఓపెన్ ఏఐ ఇ?ప్పుడు హార్డ్‌వేర్ రంగంలోకీ గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. 'డైమ్' అనే కోడ్ నేమ్‌తో కంపెనీ తన మొట్టమొదటి హార్డ్‌వేర్ ఉత్పత్తిగా ఏఐ ఆధారిత ఇయర్‌బడ్స్‌ను తీసుకురానున్నట్లు 'మింట్'తన కథనంలో పేర్కొంది. 'డైమ్' ఇయర్ బడ్స్ కేవలం సంగీతం వినడానికే పరిమితం కాకుండా, వాయిస్ కమాండ్స్ ద్వారా ఏఐ మోడళ్లను నియంత్రించేలా, హ్యాండ్స్-ఫ్రీ అసిస్టెన్స్‌ను అందించేలా రూపొందించారు. ఈ ఏడాది చివరిలో వీటిని ప్రపంచానికి పరిచయం చేసి, 2027 ప్రారంభంలో మార్కెట్లోకి వీటిని విడుదల చేసే అవకాశం ఉంది. 'స్మార్ట్ పికాచు' అందించిన సమాచారం ప్రకారం చైనాలో ఇటీవల దాఖలైన ఒక పేటెంట్ ఫైలింగ్‌లో 'డైమ్' అనే పేరు వెలుగులోకి వచ్చింది. భారీ స్థాయిలో హార్డ్‌వేర్ పరికరాలను నేరుగా మార్కెట్లోకి తెచ్చే కంటే, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఇయర్‌బడ్స్ లాంటి సాధారణ పరికరంతో రంగప్రవేశం చేయాలని ఓపెన్ ఏఐ భావిస్తోంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక ఇబ్బందులు లేకుండా హార్డ్‌వేర్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడమే కంపెనీ వ్యూహమని తెలుస్తోంది. ఇవి వాయిస్ ఇంటరాక్షన్లపై దృష్టి సారిస్తూ, వినియోగదారులకు రియల్ టైమ్ ఏఐ సేవలను నేరుగా చెవి దగ్గరికే చేర్చనున్నాయి. గతంలో ఓపెన్ ఏఐ స్మార్ట్‌ఫోన్ తరహాలో ఉండే శక్తివంతమైన ఏఐ డివైజ్‌ను తీసుకువస్తుందనే ప్రచారం జరిగింది. అయితే హై బ్యాండ్‌విడ్త్ మెమరీ (హెచ్‌బీఎం)కొరత కారణంగా విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వాయిదా పడినట్లు సమాచారం. తయారీ వ్యయం కారణంగా కంపెనీ ప్రస్తుతానికి తన నిర్ణయాన్ని మార్చుకుని, 2026లో సరళమైన వెర్షన్ (డైమ్ ఇయర్‌బడ్స్)ను లాంచ్ చేయాలని నిశ్చయించుకుందని సమాచారం. ఓపెన్ ఏఐ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ క్రిస్ లెహానే గతంలోనే కంపెనీ తొలి హార్డ్‌వేర్ ఉత్పత్తిపై పనిచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే అప్పట్లో దాని ఆకారం లేదా ఫీచర్ల గురించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ ఏడాదిలోనే ఆ పరికరాన్ని ఆవిష్కరిస్తామని ఆయన పేర్కొన్నప్పటికీ, లాంచ్ తేదీని వెల్లడించలేదు. ప్రస్తుతం 'డైమ్' బ్రాండింగ్‌తో వస్తున్న ఇయర్‌బడ్స్ వార్తలపై ఓపెన్ ఏఐ ఇంకా స్పందించాల్సి ఉంది. ఆపిల్ మాజీ డిజైన్ హెడ్ జోనీ ఐవ్ నేతృత్వంలో ఈ నూతన పరికరాలు రూపుదిద్దుకుంటున్నాయనే వార్తలు టెక్ ప్రపంచంలో సంచలనంగా మారాయి. కాగా డైమ్ ఇయర్‌బడ్స్ అందుబాటులోకి వస్తే, అవి స్మార్ట్ ఫోన్ల వినియోగానికి చెక్ పెట్టనున్నాయనే వాదన వినిపిస్తోంది.

# ఏఐ పెట్టుబడుల్లో భారత్ - 8

**అగ్రస్థానాల్లో అమెరికా, సింగపూర్**
**వరల్డ్ ఎకనమిక్ ఫోరం తాజా నివేదిక**
**2035 నాటికి భారత జీడీపీకి ఏఐ ఊతం**
**జీడీపీలోకి రానున్న రూ.50 లక్షల కోట్లు**
**పీడబ్ల్యూసీ**

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీ వేగంగా పెరుగుతున్న వేళ.. పెట్టుబడుల పరంగా భారత్ కూడా ఈ రేసులో ముందంజలోనే ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వెల్లడించింది. 2010 నుంచి 2024 వరకు ఏఐలో అత్యధిక పెట్టుబడులు (జీడీపీలో శాతంగా లెక్కించినప్పుడు) పెట్టిన 11 దేశాల జాబితాలో భారత్‌కు 8వ స్థానం దక్కింది. మరోపక్క.. ఏఐ మనదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి సుమారు రూ.50 లక్షల కోట్లు అదనంగా చేరే అవకాశం ఉందని అంచనా వేసింది.

దావోస్‌లో.. ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీతో కలిసి వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఓ శ్వేత పత్రం విడుదల చేసింది. దాని ప్రకారం.. 2010 నుంచి 2024 వరకు ఏఐలో పెట్టుబడుల పరంగా అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా, చైనా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో.. భారత్‌లో ఏఐ పెట్టుబడులు జీడీపీలో 1.2 నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. అమెరికాలో ఇది రికార్డు స్థాయిలో 3.4 నుంచి 5.1 శాతం, సింగపూర్‌లో 3.1 నుంచి 4.6 శాతం వరకు ఉంది.



### అమెరికా, చైనా దూకుడు

2010--2024 మధ్య కాలంలో ఏఐ రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 33 శాతం చొప్పున పెరిగాయని శ్వేతపత్రం తెలిపింది. ఏఐ రంగం అత్యంత ఖరీదైనదనీ, భారీగా పెట్టుబడులు అవసరమైనప్పటికీ తక్షణ లాభాలపై స్పష్టత లేదని పేర్కొనడం విశేషం. కానీ, అమెరికా, చైనా ఈ రంగంలో భారీ పందాలు కాస్తున్నాయి. 2010 నుంచి ఇప్పటివరకు పెట్టిన మొత్తం ఏఐ పెట్టుబడుల్లో 65 శాతం ఈ రెండు దేశాలదే కావడమే అందుకు నిదర్శనం.

### మూడేళ్లలో రూ. 6 లక్షల కోట్లు

భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఏఐ పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చనున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా వేసింది. అలాగే ఏఐకి అవసరమైన అధునాతన చిప్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, హార్డ్‌వేర్ రంగంలో పెట్టుబడులు ఏటా 15 నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశముందని తెలిపింది.

### ఆర్థిక వ్యవస్థకూ ఊతం

భారత్ ఆర్థిక వ్యవస్థకు ఏఐ భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా అంచనా వేసింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి రూ.50 లక్షల కోట్లకుపైగా అదనంగా వచ్చి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఇంధనం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరిగితే ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. 2050 నాటికి 160 కోట్ల జనాభాకు ఆహారం అందించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని 70 శాతం వరకు పెంచాల్సి ఉంటుందని, దీనికి డిజిటల్ సాంకేతికతలు, ముఖ్యంగా ఏఐ అవసరమని పేర్కొంది. అలాగే విద్య, వైద్య రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించింది.

**ఏఐ.. పెట్టుబడులు ఇంతింతై!**

| | దేశం | జీడీపీలో పెట్టుబడి శాతం |
|---|---|---|
| 1 | అమెరికా | 3.4 - 5.1 |
| 2 | సింగపూర్ | 3.1 - 4.6 |
| 3 | దక్షిణ కొరియా | 2.2 - 3.3 |
| 4 | చైనా | 1.7 - 2.6 |
| 5 | యూఏఈ | 1.5 - 2.3 |
| 6 | జపాన్ | 1.5 - 2.2 |
| | కెనడా | 1.5 - 2.2 |
| 7 | యూకే | 1.4 - 2 |
| 8 | భారత్ | 1.2 - 1.8 |
| 9 | యూరప్ (యూకే మినహా) | 1.1 - 1.6 |
| 10 | బ్రెజిల్ | 0.7 - 1.1 |

ఆధారం: వరల్డ్ ఎకనమిక్ ఫోరం శ్వేతపత్రం

ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటివరకు మొత్తంగా రూ.55 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'భారీ డేటా సెంటర్ల' సంఖ్య 1,136 కాగా 2030 నాటికి ఇది 2,000 దాటొచ్చని అంచనా.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి తీవ్ర గాయాలు



టెహ్రాన్ : అమెరికా--ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ గురువారం నివేదించింది. ఇప్పటికే అమెరికా దాడిలో మొజ్తాబా తండ్రి అలీ ఖమేనీ మృతి చెందారు. అమెరికా దాడిలో మొజ్తాబాకి గాయాలయ్యాయని.. దీంతో ఆయన ప్రస్తుత నిర్ణయాధికారాన్ని రివల్యూషనరీ గార్డ్స్ యొక్క సైద్ధాంతిక సైన్యంలోని జనరల్స్‌కు అప్పగించారని పేర్లను వెల్లడించని పలువురు ఇరానియన్ అధికారులను ఉటంకిస్తూ టైమ్స్ ప్రతిక పేర్కొంది. కాగా, మొజ్తాబా ఖమేనీ తన తండ్రి తర్వాత సుప్రీం లీడర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి బహిరంగంగా కనిపంచలేదు. కేవలం ఆయన నుంచి లిఖితపూర్వక ప్రకటనలు మాత్రమే వెలువడుతున్నట్లు కనిపిస్తోంది. దీంతో అసలు ఆయన బతికే ఉన్నారా? లేదా? అనే ఊహాగానాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక మొజ్తాబాకి గాయాలయ్యాయని ప్రకటించడంతో ఊహాగానాలు నిజమేనని తెలుస్తోంది.

## అందుకే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు: అమిత్‌షా

నిన్న జరిగిన బెంగాల్ తొలివిడత ఎన్నికల్లో బీజేపీ భారీగా సీట్లు దక్కించుకోబోతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. పోలింగ్ జరిగిన 152 స్థానాల్లో బీజేపీ ఏకంగా 110 సీట్లను సొంతం చేసుకోబోతుందన్నారు. బెంగాల్ ప్రజలు ప్రస్తుత పాలన పట్ల విసిగిపోయారని, రాష్ట్రంలో ఖచ్చితంగా మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్లు ఎనలేని ఉత్సాహంతో, ఆవేశంతో పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని అందుకే రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయ్యిందన్నారు. ఇది అధికార పక్షానికి వ్యతిరేకంగా జరిగిన నిశ్శబ్ద విప్లవమని అభిప్రాయపడ్డారు. అయితే నిన్న (గురువారం) ప్రధాని మోదీ సైతం ఈ విధంగానే మాట్లాడారు. బెంగాల్‌లో జరిగిన భారీ ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. మే 4 తర్వాత బెంగాల్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తామని బెంగాల్ ప్రజలకు ఝాల్‌మురీ, స్వీట్లు పంపిణీ చేస్తానని తెలిపారు. కాగా ఎన్నికల ఫలితాలు రాకముందే ఇంత భారీ స్థాయిలో సీట్లు గెలుచుకుంటామని ప్రకటించడం వెనుక బీజేపీ పక్కా వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్రంలోని మిగిలిన విడతల ఎన్నికల ప్రచారం మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. కాగా బెంగాల్ తొలివిడత పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఏకంగా 92.72శాతం పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది.

## భారత్ కచ్చితంగా ఫిఫా వరల్డ్ కప్‌లో ఆడుతుంది..
## ఆ జట్టులో తెలంగాణ స్టార్లు ఉంటారు: సీఎం రేవంత్

ఫిఫా వరల్డ్ కప్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

భవిష్యత్తులో భారత్ వరల్డ్ కప్ ఆడుతుందని ధీమా

ఆ జట్టులో తెలంగాణ ఆటగాళ్లు ఉంటారని జోస్యం

గతంలో మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్న వైనం




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తనకున్న దార్శనికతను పంచుకున్నారు. భవిష్యత్తులో టీమిండియా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఆడటమే కాకుండా, ఆ టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ మధ్య ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఫుట్‌బాల్‌ను ఎంతగానో ఇష్టపడతానని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో వరల్డ్ కప్ ఆడే భారత జట్టులో తెలంగాణ నుంచి పలువురు స్టార్లు ఉంటారని జోస్యం చెప్పారు. "ఈ మాట గుర్తుపెట్టుకోండి.. భవిష్యత్ సాకర్ స్టార్లు చాలామంది తెలంగాణ నుంచే వస్తారు" అని ఆయన అన్నారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక లోతైన ఉద్దేశం, దార్శనికత ఉన్నాయని వివరించారు. గతంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తెలంగాణ పిల్లలతో కలిసి మైదానంలో పాలుపంచుకునేలా చేసిన రోజును తాను ఎంతో ఇష్టపడతానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చివరగా, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆయన ఆకాంక్షించారు.

## కాగ్ నివేదిక దిగ్భ్రాంతికరం

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కొద్ది రోజుల క్రితం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలోని అంశాలు దిగ్భ్రాంతిగొలుపుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరాంతంలో రూపొందించిన ఈ నివేదికలో గత కొన్నేళ్లుగా వివిధ శాఖల్లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలను అంకెలతో సహా కాగ్ వివరించింది. ఆర్థిక అవకతవకలను, నిధుల దుర్వినియోగాన్ని కళ్లకు కట్టినట్టు వివరించిన అత్యంత కీలకమైన ఈ నివేదికకు మోడీ ప్రభుత్వం కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆయనకు ఎల్లవేళలా వంత పాడే కార్పొరేట్ మీడియా సైతం అదే బాట పట్టడం, ఈ నివేదికను దాదాపుగా విస్మరించడం, అరకొర అంశాలతో సరిపెట్టడం ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిన దాదాపు 54వేల కోట్ల రూపాయలకు ఎటువంటి లెక్కలూ లేవు. ఆ మొత్తాన్ని ఎందుకోసం ఖర్చు చేశారో తెలియచేసే పత్రాలు కూడా లేవు. 'పదే పదే అడిగినా పథకాల పేర్లు తప్ప ఎటువంటి పత్రాలను అధికారులు ఇవ్వడం లేదు' అని 'అనేక ఆర్థిక లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయి' అని కాగ్ పేర్కొనడం గమనార్హం. నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవపత్రం (యుటిలైజేషన్ సర్టిఫికెట్-యుసి) సమర్పించడం తప్పనిసరి. జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ -2017లోని 238వ రూల్ ప్రకారం నిధులు ఖర్చు చేసిన 12 నెలల్లోగా దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఖచ్చితంగా సమర్పించి తీరాలి. కానీ, కాగ్ పదే పదే కోరినా ప్రభుత్వ శాఖలు స్పందించకపోవడం దేనికి సంకేతమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాగ్ నివేదిక ప్రకారం ఇలా యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించని శాఖల్లో కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ మొదటి స్థానంలో ఉంది. 18,273 కోట్ల రూపాయల మొత్తానికి ఆ శాఖ నుండి యు.సి లు రావాల్సిఉంది. ఆ తరువాత స్థానంలో ఉన్న ఉన్నత విద్యాశాఖ 14,359 కోట్ల రూపాయలకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాల్సిఉంది. ఇలా 2025 మార్చి 31 నాటికి 15 కేంద్ర ప్రభుత్వ శాఖల నుండి 33,973 సర్టిఫికెట్లు అందాల్సి ఉందని కాగ్ పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నిబంధనల ప్రకారం ఈ ధృవ పత్రాలను సమర్పించని సంస్థలను ఆర్థికశాఖ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి తీరాలి. ఏళ్ల తరబడి ఆ నిబంధనలు ఎందుకు అమలు కాలేదో, అలా అమలు కాకపోవడం వెనుక ఏ శక్తులు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకవైపు అందుబాటులో ఉన్న నిధులను అవ్యవస్థంగా ఖర్చు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు సంక్షేమ పథకాలకు కేటాయింపులను తగ్గించడం, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వకపోవడం వంటి చర్యలకు పాల్పడుతుండటం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక అవకతవకలు వెలుగులోకి రావడం మొదటిసారి కాదు. గతంలోనూ ఇటువంటి అంశాలను కాగ్ వెల్లడించింది. వాటిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ సంస్థల అవకతవకలను ఎత్తిచూపినా కేంద్రం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. పార్లమెంట్‌లో కనీస చర్చ కూడా జరగనివ్వడం లేదు. కేంద్రం అమలు చేస్తున్న ముఖ్యమైన మూడు పథకాలలో జరిగిన కోట్ల రూపాయల అవకతవకలను ఇటీవల కాగ్ బట్టబయలు చేసింది. ద్వారక ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో మొదట ప్రతి కిలోమీటర్‌కు 18.20 కోట్లుగా ఖర్చు అంచనా వేయగా, అది తరువాత 250.7 కోట్లకు పెరిగింది. సరైన ప్రాజెక్ట్ నివేదిక లేకుండానే ఇంత భారీ ఖర్చు చేయడంపై కాగ్ లేవనెత్తిన సందేహాలకు ఇంతవరకు స్పష్టమైన సమాధానం రాలేదు. గ్రామీణాభివృద్ధి పథకాలలో, ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య బీమా పథకం ఇలా చెప్పుకుంటే ఈ జాబితా కొండవీటి చాంతాడంత ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో 80,000 మందికి ఒకే ఫోన్ నంబర్ నమోదు చేయడాన్ని కాగ్ ఎత్తి చూపినా పాలకులలో చలనం లేదు. వేల కోట్ల రూపాయల అవకతవకలకు సంబంధించిన తాజా నివేదికకు కూడా అదే గతి పడుతుందన్న అనుమానాలు పరిశీలకుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పాల్సిందే. దీనికి భిన్నంగా పాలనా వ్యవస్థలన్నింటిని తమ ఆధీనంలో ఉంచుకుని, ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుంది. ఈ ధోరణులను ప్రతిఘటించడం ప్రజాస్వామ్య వాదుల కనీస బాధ్యత!

# తిరుమలలో గదుల కేటాయింపు ఇక సులభతరం..

టీటీడీ కొత్త విధానం పూర్తి వివరాలు

తిరుమలలో వసతి గదుల కోసం టీటీడీ కొత్త విధానం

సీఆర్వోలో రిజిస్ట్రేషన్, ఉప విచారణ కార్యాలయాల్లో కేటాయింపు

డిస్ప్లే బోర్డులు, ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు సమాచారం

గదుల కేటాయింపు, ఖాళీ చేయడంపై కఠిన నిబంధనలు

ఆన్‌లైన్‌లోనే రుసుము చెల్లింపు తప్పనిసరి



శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులు వసతి గదుల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానమ్స్) స్వస్తి పలికింది. గదుల కోసం కేంద్రీయ విచారణ కార్యాలయం (సీఆర్వో) వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా, సులభతరమైన, ఆధునిక సాంకేతికతతో కూడిన నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా ఉప విచారణ కార్యాలయాల ద్వారా భక్తులకు వేగంగా గదులను కేటాయిస్తూ వారి సమయాన్ని, శ్రమను ఆదా చేస్తోంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..

వసతి గది కావాలనుకునే భక్తులు ముందుగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి గదులు అందుబాటులో ఉన్నంత వరకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. క్యూలైన్‌లో తమ వంతు వచ్చిన తర్వాత, భక్తులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా దాని జిరాక్స్ కాపీతో పాటు, ఫోన్ నంబర్‌ను అక్కడి కౌంటర్‌లో అందించాలి. అనంతరం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకుంటారు. ఈ సమయంలో భక్తులు తమకు కావాల్సిన గది కేటగిరీని ఎంచుకోవచ్చు.

ఎా కేటగిరీ: రూ.50, రూ.100 అద్దె గల గదులు ఉంటాయి. దీ కేటగిరీ: రూ.1000 అద్దె గల గదులు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే, రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు నిర్ధారిస్తూ భక్తులకు ఒక అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ ఇస్తారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాగునీరు, అల్పాహారం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది.

గది కేటాయింపు సమాచారం

రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక, భక్తులు సీఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ డిస్ ప్లే బోర్డులను గమనిస్తూ ఉండాలి. రిజిస్ట్రేషన్ క్రమ సంఖ్యల వారీగా గదులు కేటాయించబడుతున్న సమాచారం ఈ బోర్డులపై కనిపిస్తుంది. తమ రిజిస్ట్రేషన్ నంబర్ డిస్ ప్లే అయిన 15 నిమిషాల్లోపే, వారు నమోదు చేసిన ఫోన్ నంబర్‌కు గది కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలతో ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. ఒకవేళ ఎస్ఎంఎస్ రాకపోయినా, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీఆర్వో వద్ద ఉన్న కియోస్క్ మెషీన్లలో తమ అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌ను స్కాన్ చేయడం ద్వారా గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయం వివరాలు తెలుసుకోవచ్చు.

ఉప విచారణ కార్యాలయంలో చెల్లింపు

ఎస్ఎంఎస్ లేదా కియోస్క్ ద్వారా సమాచారం అందిన తర్వాత, భక్తులు నేరుగా తమకు గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ గది అద్దె రుసుమును తప్పనిసరిగా ఆన్‌లైన్ పద్ధతిలో (ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐ, క్రెడిట్/డెబిట్ కార్డు) మాత్రమే చెల్లించాలి. నగదు చెల్లింపులకు అవకాశం లేదు. రుసుము చెల్లించిన వెంటనే వారికి గది తాళాలు అందజేస్తారు.


తిరుమలలోని ప్రధాన ఉప విచారణ కార్యాలయాలు

అంజనాద్రి నగర్ కాటేజస్ శేషాద్రి నగర్ కాటేజస్ శంఖుమిట్ట కాటేజస్ గరుడాద్రి నగర్ కాటేజస్ సుదర్శన, గోవర్ధన్, కల్యాణి సత్రాలు సప్తగిరి, రామ్ భగీచా, వరాహ స్వామి విశ్రాంతి గృహాలు కౌస్తుభం, పాంచజన్యం, నందకం విశ్రాంతి గృహాలు

### భక్తులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు

గది పొందడానికి భక్తుడికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ఒంటరి వ్యక్తులకు, అవివాహితులకు గదులు కేటాయించరు. ఒకసారి గది పొందిన వ్యక్తి, తిరిగి 30 రోజుల వరకు మరో గదిని పొందలేరు. కుటుంబం నుంచి ఒక వ్యక్తి మాత్రమే రిజిస్ట్రేషన్ క్యూలో నిలబడాలి. గదులు 24 గంటల కాలానికి మాత్రమే కేటాయిస్తారు. గడువు దాటితే 200 శాతం, 48 గంటలు దాటితే 400 శాతం అదనపు రుసుము వసూలు చేస్తారు. గదిని పొందిన భక్తుడే స్వయంగా ఖాళీ చేయాలి, లేదంటే కాషన్ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదు. తమకు కేటాయించిన గదిని ఇతరులకు ఇవ్వడం నిషిద్ధం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు.

# డిజిటల్ స్క్రీన్ యుగంలోనూ పుస్తకాలే విజేతలు..
# ప్రింట్ చదువు ఎందుకు ప్రత్యేకం?



ప్రింట్ రూపంలోని పుస్తకాలు చదవడం గతకాలపు అవశేషంగా మారుతుందని కొందరు సూచించారు.. అంతేకాకుండా, పుస్తకాలను ఎలక్ట్రానిక్‌గా చదవడం ప్రమాణంగా మారుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ అంచనాలు పూర్తిగా తప్పు కావు. కిండిల్స్, కోబోస్ బాగా ప్రాచుర్యం పొందాయి, కానీ ప్రింట్ పుస్తకాలు ఎక్కడికీ వెళ్ళడం లేదు. మీ వేలికొనలకు ఏదైనా డౌన్లోడ్ చేసుకునే ఎంపిక ఉన్నప్పటికీ, ప్రజలు ఇప్పటికీ తమ స్థానిక పుస్తకాల షాపులకు లేదా సెకండ్ హ్యాండ్ దుకాణాలకు వెళ్లి ఒక ముద్రిత నవలను కొనుగోలు చేయడాన్ని ఎంచుకుంటున్నారు. తార్కికంగా, సులభమైన ఎంపికను ఎంచుకోవడం అర్థవంతంగా ఉంటుంది, కాబట్టి గతం వాతావరణంతో కూడిన పేజీల వైపు మనం ఇప్పటికీ ఎందుకు ఆకర్షితులవుతున్నాం?

### మెదళ్లను వెలిగించగలవా?

మీ మెదడు ప్రింట్ పుస్తకాలను స్క్రీన్ల కంటే ఎందుకు ఎక్కువగా ఇష్టపడుతుంది? భౌతిక పుస్తకాలు నిజంగా స్క్రీన్ల కంటే మెదడును ఎక్కువగా నిమగ్నం చేస్తాయా? మనం చదివే పుస్తకాల కంటే మన స్క్రీన్లు చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఒక బటన్ క్లిక్ చేస్తే అవి మనకు రంగులు, వీడియోలను చూపించగలవు. కానీ అవి మన మెదళ్లను కూడా వెలిగించగలవా?

### ఈ రీడర్‌ను మెదడు పరిగణించదు!

లైట్లు మసకబెట్టి, కొత్త మిస్టరీ నవల మొదటి అధ్యాయాన్ని ప్రారంభిం చడం వలన మీ ఆసక్తి మాత్రమే తీరదు. ఇది మీ మెదడును మాన్హట్టన్ స్కైలైన్ లాగా వెలిగిస్తుంది. మన మెదళ్లు స్పర్శకు, భౌతికంగా ఉనికిలో ఉన్న, మన స్థల జ్ఞాపక శక్తిని నిమగ్నం చేసే వస్తువులకు ఆకర్షితులవుతాయి. కాగితాన్ని అనుభూతి చెందడం, పేజీని తిప్పడం, మనం చదువుతున్న పదాల గురించి ఆలోచించడం మధ్య ఉన్న ఆ సంబంధం చాలా ముఖ్యమైనది. వాటిని స్క్రీన్‌పై చదివినప్పుడు కంటే చాలా లోతైన జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి. మన మెదళ్ళు ఈ-రీడర్లను తాత్కాలికంగా పరిగణిస్తాయి.

### ప్రింట్ పుస్తకాలను ఇష్టపడతారా?

యువతీ యువకులు ప్రింట్ పుస్తకాల పట్ల ఆకర్షణను పంచుకుంటున్నారు. 2019లో, ఒక అధ్యయనం ప్రకారం 18-29 సంవ త్సరాల వయస్సు గల వారిలో 74% మంది ఇప్పటికీ ఈ-బుక్స్ కంటే ప్రింట్ పుస్తకాలను ఇష్టపడతారు.. పైగా చదవడానికి సంబంధించిన సాంప్రదాయ రూపాలు మన మెదడులోని చాలా ఎక్కువ ప్రాంతాలను వెలిగిస్తాయి. ఆల్డస్ హక్స్లీ రాసిన డిస్టో పియన్ నవల బ్రేవ్ న్యూ వరల్డ్ ఒక భవిష్యత్ ప్రపంచాన్ని వివరిస్తుంది, ఇక్కడ నివాసితులు ఎల్లప్పుడూ కృత్రిమమైన ఆనందంలో, సంతోషంలో ఉంటారు. ప్రజలు ఈ ఆనంద భావన కోసమే జీవిస్తారు. దానికి ప్రతిఫలంగా, వారు గాఢమైన చింతన క్షణాలను అరుదుగా అనుభవిస్తారు. ఈ 'బ్రేవ్ న్యూ వరల్డ్'లోని ప్రజలు ఉపరితలంగా జీవితాన్ని గడుపుతున్నారు, కానీ, హక్స్లీ ఎప్పటికీ ఈ-బుక్స్‌ని ఖండించి ఉండేవాడు కాదు.

### ప్రపంచం కొత్తగా ఉండొచ్చు కానీ..

అవి చదవడం, విమర్శనాత్మక ప్రతిబింబానికి చెందిన ఒక రూపమే, కానీ సాంకేతిక పురోగతి గొప్పది కాదని అతను మనల్ని హెచ్చరించి ఉండవచ్చు.. పురోగతి పేరుతో మనం ఏమి వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాం అని అడిగి ఉండవచ్చు. భౌతిక పుస్తకాలు చాలా సంవత్సరాలుగా ఉనికిలో ఉన్నాయి, మట్టి పలకల నుండి ముద్రిత పేజీల వరకు పరిణామం చెందుతూ, చక్రవర్తులు, ప్రభువుల అల్మారాలలో వరుసలో ఉండేవి. ఇప్పుడు మీ స్వంత ఇంట్లో కూడా ఉన్నాయి. మన ప్రపంచం కొంత కొత్తగా ఉండవచ్చు, కానీ మనం పాతదాని విలువను మరచిపోలేదు.. మన స్క్రీన్ల కాంతి అందంగా ఉండవచ్చు, కానీ దాన్ని ఎప్పటికీ ప్రకాశించే, సక్రియం చేయబడిన మనస్సుకు చెందిన తిరుగులేని అందంతో పోల్చలేము.


# వేసవి.. అపోహలకు దూరంగా ఉందాం!

నేడు భూగోళం వేడెక్కుతోంది. వాతావరణ మార్పుల ప్రభావం మన ముంగిట నిప్పుల కొలిమిలా మారింది. గడిచిన కొన్నేళ్లుగా మార్చి నెల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటం ఆందోళనకరం. విచ్చలవిడిగా చెట్ల నరికివేత, కాంక్రీట్ భవనాల నిర్మాణం, పెరుగుతున్న వాహన కాలుష్యం వెరసి నగరాలు 'హీట్ ఐలాండ్స్'గా మారుతున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచడానికి సోషల్ మీడియా వేదికగా వస్తున్న సమాచారం ఒకవైపు ఉపయోగపడుతున్నప్పటికీ, మరోవైపు శాస్త్రీయత లేని 'అత్యవసర హెచ్చరికలు' అనవసర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈ వేసవిని సురక్షితంగా ఎదుర్కోవాలంటే మనకు కావాల్సింది భయం కాదు, బాధ్యతాయుతమైన అప్రమత్తత.

### శాస్త్రీయత లేని వాదనలు..

ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో కొన్ని సందేశాలు విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి.. వీటిని లోతుగా విశ్లేషిస్తే అందులో వాస్తవాల కంటే అతిశయోక్తులే ఎక్కువగా కనిపిస్తాయి.. ఉదాహరణకు, ఉష్ణోగ్రతలు 50డిగ్రీల నుండి 55డిగ్రీల వరకు పెరుగుతాయనే ప్రచారం అన్ని ప్రాంతాలకు వర్తించదు. రాజస్థాన్ వంటి ఎడారి ప్రాంతాల్లో లేదా కొన్ని నిర్దిష్ట పారిశ్రామిక ప్రాంతాల్లో ఇవి నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ జనావాసాల్లో ఇంతటి తీవ్రత అరుదు. అందుకే ప్రచారాలను నమ్మొద్దు. భారత వాతావరణ శాఖ బులిటెన్‌లను మాత్రమే మనం ప్రామాణికంగా తీసుకోవాలి. అలాగే ఎండ తీవ్రతకు ఫోన్లు పేలడం లేదా వాహనాల ట్యాంకులు పేలడం వంటివి సామాన్యంగా జరగవు.. తక్కువ నాణ్యత గల బ్యాటరీల వల్ల లేదా సాంకేతిక లోపాల వల్ల ప్రమాదాలు జరగవచ్చు కానీ, కేవలం వాతావరణ వేడి వల్లే ఇవి సంభవిస్తాయనడం అపోహ మాత్రమే.. అదే విధంగా అల్ట్రావయొలెట్ (యువి) కిరణాల శాతం గురించి వచ్చే అంకెలలో కూడా శాస్త్రీయత లోపించింది. ఓజోన్ పొర మనల్ని రక్షిస్తూనే ఉంది, అయితే సుదీర్ఘకాలం ఎండలో ఉండటం వల్ల చర్మ సమస్యలు రావచ్చుననేది వాస్తవం.

### వ్యక్తిగత రక్షణ కోసం..




ఇక వేసవి తీవ్రత నుంచి తప్పించుకోవడానికి కేవలం నీళ్లు తాగడం మాత్రమే సరిపోదు, ఒక క్రమ శిక్షణతో కూడిన జీవనశైలి అవసరం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండాలంటే దాహం వేసే వరకు ఆగకుండా గంటకోసారి నీరు తాగాలి. ఓఆర్ఎస్ (రాూా), మజ్జిగ, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ నీరు వంటివి సేవించాలి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడతాయి. వేసవిలో జీర్ణక్రియ మందగిస్తుంది కాబట్టి తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ప్రోటీన్ ఎక్కువగా ఉండే మాంసాహారం, మసాలాలు, వేపుళ్లు తగ్గించడం ఉత్తమం. కాఫీ, టీ, ఆల్కహాల్ శరీరంలోని నీటిని త్వరగా బయటకు పంపి డీహైడ్రేషన్ ముప్పును పెంచుతాయి. వీటికి బదులుగా మట్టి కుండలో నీరు, పుచ్చకాయ, దోసకాయ వంటి ప్రకృతి సిద్ధమైన పండ్లను ఆశ్ర యించాలి. వ్యక్తిగత రక్షణ కోసం ప్రయాణ సమయాల్లో మార్పులు చేసుకోవడం తప్పనిసరి. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలి. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు.. ఈ సమయంలో బయటకు రాకపోవడమే శ్రేయస్కరం.


### ఈ వైరస్ ప్రమాదకరం!

బయటకు వెళ్లాల్సి వస్తే లేత రంగులో ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఇవి గాలిని లోపలికి పంపి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.. తల కప్పుకోవడానికి గొడుగు లేదా టోపీ, కళ్ల రక్షణకు నాణ్యమైన సన్ గ్లాసెస్ వాడటం మంచిది. ఒకవేళ వడదెబ్బ తగిలిన లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలి. మనం చల్లగా ఉండటానికి ప్రయత్ని స్తున్నట్టే మనమీద ఆధారపడి ఉండే మూగ జీవాల పట్ల కూడా కారుణ్యం చూపాలి. పక్షులు, జంతువుల కోసం ఇంటి మేడ మీద లేదా బయట చిన్న పాత్రల్లో నీటిని ఉంచాలి.. అటవీ ప్రాంతాల్లో నీరు దొరకక కొన్ని జంతువులు జన ఆవాసాల్లోకి వచ్చే అవకాశం ఉంది. అటువంటి సమయంలో భయాం దోళన చెందకుండా అటవీ శాఖకు సమాచారం అందించాలి. ఇక సమాచార విస్ఫోటనం జరుగుతున్న ఈ రోజుల్లో నిజా నిజాలను నిర్ధారించుకోవడం ఒక సామాజిక బాధ్యత. ప్రభుత్వం, వాతావరణ శాఖ ఇచ్చే అధికారిక సూచనలను మాత్రమే అనుసరించాలి. భయపెట్టే సందేశాలను ఫార్వార్డ్ చేయడం కంటే, శాస్త్రీయమైన జాగ్రత్తలను పంచుకోవడం ద్వారా సమాజాన్ని రక్షించవచ్చు. ప్రకృతి వైపరీత్యం కంటే మానవ నిర్మితమైన 'అపోహల వైరస్' ఎప్పుడూ ప్రమాదకరమైనదే. మెరుగైన అవగాహనతో, అప్రమత్తమైన జీవనశైలితో ఈ వేసవిని సురక్షితంగా ఎదుర్కుందాం.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# గ్లామర్ డోస్ పెంచేసిన కృతి సనన్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత హీట్ పెంచుతూ!



అసలే సమ్మర్.. సూర్య భగవానుడి భగభగ మంటలకు ప్రజలు అల్లాడిపోతుంటే .. హీరోయిన్లు కూడా ఆ వేడిని మరింత పెంచడానికి సెగలు పుట్టించేలా ఔట్ ఫిట్స్ ధరిస్తూ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఒకరి తర్వాత ఒకరు.. ఒకరితో ఒకరు పోటీపడుతూ గ్లామర్ విందు వడ్డిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు . ఇక సోషల్ మీడియా వాడకం ఎప్పుడైతే పెరిగిపోయిందో అటు చిన్న పిల్లల్ని మొదలుకొని పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లేనిదే గడవని రోజులు . అలాంటి ఈ సమయంలో హీరోయిన్స్ కూడా తమ అందాలను ఎరగా వేసి క్యాష్ చేసుకుంటున్నారు అనే వార్తలు ఎప్పటికప్పుడు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలా అందాలతో మరింత హీట్ పెంచుతూ బ్లాక్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించే ప్రయత్నం చేసింది కృతి సనన్. విభిన్నమైన ఫోజులు ఇస్తూ సెగలు పుట్టించేలా ఫోటోలకు పంచుకుంది. బ్లాక్ అవుట్ ఫిట్ లో కృతి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. లెదర్ మెటీరియల్ ను తలపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈమె తన అవుట్ ఫిట్ ను మరింత అందంగా మార్చుకుంది. హుందాగా ఫోటోలకు ఫోజులిస్తూ మెస్మరైజ్ చేసింది. మరికొన్ని ఫోటోలలో రొమాంటిక్ గా ఫోజులిస్తూ నెటిజన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా మొత్తానికైతే కృతి తాజాగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలోకి రాకముందు పెద్ద పెద్ద కంపెనీల కమర్షియల్ యాడ్స్ లలో నటించిన ఈమె.. తొలిసారి తెలుగులో మహేష్ బాబు హీరోగా వచ్చిన 1: నేనొక్కడినే అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం



చేసింది. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇక ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులను తన అందం , హైట్ తో అందర్నీ ఆకట్టుకున్న కృతి సనన్.. హిందీలో జాకీ ష్రాఫ్ వారసుడు టైగర్ ష్రాఫ్ తో హీరోపంతి సినిమాలో నటించి హిందీ రంగ ప్రవేశం చేసిం.ది ఇక తర్వాత ఆది పురుష్ సినిమాలో సీత పాత్ర పోషించి.. ఇటు తెలుగు ప్రేక్షకులను మరోసారి పలకరించింది కృతి సనన్. హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె తాజాగా కాక్ టెయిల్ 2 సినిమాలో నటిస్తోంది. రష్మిక మందన్నతో కలిసి నటిస్తోంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది ఈ చిన్నది.. మరి ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.


# ధురంధర్ తర్వాత రామాయణ.. మరి వారణాసి



బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది.

బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఆ మూవీ రెండు భాగాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు కలెక్షన్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. దీంతో పెద్ద కథలను రెండు భాగాలుగా తెరకెక్కించే ట్రెండ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ఇక ఇప్పుడు అందరి దృష్టి బాలీవుడ్ లో తెరకెక్కుతున్న భారీ పౌరాణిక చిత్రం రామాయణపై పడింది. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఆ మూవీ ఇప్పటికే రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ ద్వారా ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. చాశ్రీంశీ =ముఃం - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? చాఃజవతీఅంవఎవత్ భారీ బడ్జెట్, అద్భుతమైన విజువల్స్ తో ఆ చిత్రం తెరకెక్కుతున్న నేపథ్యంలో, రెండు భాగాలుగా విడుదల చేయడం సరైన నిర్ణయమని అంతా అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే వారణాసి సినిమా గురించి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ కూడా ఉండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆ సినిమాను కూడా రెండు భాగాలుగా విడుదల చేస్తారా లేదా అనేది ఇంకా క్లారిటీ లేదు. తెలుగు సినీ పరిశ్రమలో సీక్వెల్ ట్రెండ్ ను పాపులర్ చేసిన వ్యక్తి రాజమౌళి. ఆయన తెరకెక్కించిన బాహుబలి సినిమాను రెండు భాగాలుగా విడుదల చేసి సంచలనం సృష్టించారు.- యూనిక్ లుక్: -రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! ఆ తర్వాత నుంచి పెద్ద కథలు రెండు పార్టులుగా చెప్పే ధోరణి బలపడింది. అయితే రాజమౌళి తన ప్రతి సినిమాను రెండు భాగాలుగా తీస్తారని మాత్రం కాదు. ఉదాహరణకు ఆయన తీసిన ఆర్ఆర్ఆర్ ఒకే భాగంగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. వారణాసి సినిమాపై కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఆ మూవీని రెండు పార్టులుగా తెరకెక్కించే ఆలోచన ఉందా లేదా అనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. గతంలో రాజమౌళి ఆ ప్రాజెక్ట్ ను రెండు భాగాలుగా తీసే ఆలోచన లేదని సంకేతాలు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే కథ, విజువల్ స్కేల్ ను బట్టి ఫైనల్ గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మొత్తానికి, ధురంధర్ విజయంతో ప్రారంభమైన ఆ చర్చ రామాయణతో మరింత బలపడింది. ఇప్పుడు అందరి చూపు వారణాసిపై ఉంది. అది కూడా రెండు భాగాలుగా వస్తుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్నది తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# టాలీవుడ్ హీరోయిన్ల రెమ్యూనరేషన్లపై ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది



గతంలో ఒకటి లేదా రెండు చిత్రాలతో మంచి గుర్తింపు పొందిన కొందరు హీరోయిన్లు.. ప్రస్తుతం అవకాశాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం వీరి హీట్ పుట్టించే ఫోటోలు, గ్లామర్ పోస్టులు తరచుగా కనిపిస్తూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీరి కెరీర్ గ్రాఫ్ పై, అలాగే పారితోషికాలపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. అయితే గతంలో ఒకటి రెండు హిట్లు సాధించిన కొంతమంది హీరోయిన్లు, నిర్మాతలు సంప్రదించినప్పుడు ఒక్క సినిమాకు కోటి రూపాయలకు పైగా డిమాండ్ చేస్తున్నారట. అయితే ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి మారిపోవడంతో, నిర్మాతలు అంత భారీ మొత్తాలు చెల్లించడానికి వెనుకంజ వేస్తున్నారు. దీంతో వారికి కొత్త అవకాశాలు తగ్గుతున్నాయని తెలుస్తోంది. డైలమాలో స్టార్ డైరెక్టర్లు.. నిజానికి ఒక హీరోయిన్ కు మార్కెట్ ఉండాలంటే వరుసగా సినిమా అవకాశాలు రావడం చాలా ముఖ్యం. కానీ ఎక్కువ పారితోషికం ఆశిస్తూ అవకాశాలను వదులుకుంటే, తర్వాత అవకాశాలు దొరకని పరిస్థితి వస్తుందని చెప్పాలి. ఈ నేపథ్యంలో కొంత మంది నిర్మాతలు తక్కువ బడ్జెట్ సినిమాలపై దృష్టి పెట్టడంతో, హీరోయిన్లకు ఇచ్చే రెమ్యునరేషన్ కూడా గణనీయంగా తగ్గించాలనే ఆలోచనలో ఉన్నారట. మరోవైపు ప్రస్తుతం ఓటీటీ ప్లాట్ ఫామ్స్ నుంచి వచ్చే ఆదాయం కూడా గతంతో పోలిస్తే తగ్గినట్లు సమాచారం. థియేటర్లలో కూడా కలెక్షన్లు ఆశించినంతగా రాకపోవడంతో, నిర్మాతలు ఖర్చు తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ ప్రభావం మొదటగా హీరోయిన్ల పారితోషికాలపై పడుతుందని వినికిడి. ఇప్పటికే కొంతమంది నిర్మాతలు ఒక్కో హీరోయిన్ కు 8 నుంచి 15 లక్షల మధ్యే పారితోషికం ఇవ్వాలని భావిస్తున్నారట. ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న హీరోయిన్ల కు అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మరాఠీ, కన్నడ వంటి ఇతర భాషల నుంచి వచ్చిన కొత్త వాళ్ళు తక్కువ పారితోషికంతో వరుసగా అవకాశాలు దక్కించుకుంటున్నారు. దీంతో వారు ఒకేసారి మూడు నుంచి నాలుగు సినిమాల్లో నటిస్తూ బిజీగా మారుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో, ఓ హీరో లేదా నిర్మాత అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ పారితోషికం ఇచ్చి హీరోయిన్ ను తీసుకుంటారని, కానీ అది తాత్కాలికమేనని చెప్పాలి. సందీప్‌రెడ్డి వంగని ఆకాశానికి ఎత్తేస్తున్న నిర్మాత! అలాంటి ఒకటి రెండు అవకాశాలు వచ్చినా, అదే పరిస్థితి మళ్లీ రిపీట్ అవ్వొచ్చు. మొత్తానికి ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో ఖర్చులను నియంత్రించే దిశగా మార్పులు జరుగుతున్నాయి. ఆ మార్పుల్లో భాగంగా హీరోయిన్ల పారితోషికాలు కూడా తగ్గే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ డిమాండ్లను మార్చుకుంటేనే హీరోయిన్లు వరుస అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశముంది. మరేం జరుగుతుందో చూడాలి

# ప్రదీప్ రంగనాథన్‌కు 50 కోట్లా



వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆ హీరోను లాక్ చేయడం కోసం మార్కెట్ స్థాయిని మించి, కొంచెం ఎక్కువ పారితోషకం ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తారు. అలా అని ఆ హీరో మీద పెట్టగలిగే గరిష్ట బడ్జెట్ మొత్తాన్ని కేవలం పారితోషకం రూపంలో ఇస్తారంటే వినడానికి విడ్డూరంగా అనిపించక మానదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్‌కు ఏకంగా రూ.50 కోట్లు పారితోషకంగా ఇవ్వబోతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఇలాగే ఇప్పుడు అందరికీ కామెడీగా తోస్తోంది. ప్రదీప్ ఇప్పటికే మైత్రీ సంస్థలో 'డ్యూడ్' మూవీ చేశాడు. ఆ సినిమా వంద కోట్ల వసూళ్లు రాబట్టింది. కానీ షేర్ రూ.50 కోట్ల లోపే వచ్చింది. సినిమాకు రూ.50 కోట్ల పైగానే ఖర్చయింది. ఆ చిత్రానికి ప్రదీప్ రంగనాథన్ రూ.15 కోట్ల మేర పారితోషకం అందుకున్నాడు. చాశ్రీంశీ =ముఃం - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? చాఃజవతీఅంవఎవత్ అలాంటిది ఇప్పుడు దాని మీద మూడు రెట్ల పారితోషకంతో అతను మైత్రి సంస్థలో సినిమా చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రీన్ ప్లే మాస్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ సీనియర్ దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి.. ప్రదీప్ హీరోగా మైతీ సంస్థలో సినిమా చేయడానికి అంగీకారం కుదిరింది. తనకు తమిళంలో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ.. మరోసారి తెలుగు బేనర్లో, పైగా తెలుగు దర్శకుడితో సినిమా చేయడానికి ప్రదీప్ ఒప్పుకోవడం విశేషమే. ఈ చిత్రానికి 'డ్యూడ్' కంటే ఎక్కువ పారితోషకం తీసుకుంటే ఆశ్చర్యమేమీ లేదు. మహా అయితే రూ.20-25 కోట్ల మధ్య రెమ్యూనరేషన్ తీసుకుంటాడేమో-రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! కానీ ఏకంగా రూ.50 కోట్లు అని తమిళ మీడియా జనాలు రిపోర్ట్ చేస్తుండడమే విడ్డూరం. పేరున్న తమిళ పీఆర్, క్రిటిక్ హ్యాండిల్స్ అన్నీ ప్రదీప్ రెమ్యూనరేషన్ గురించి టెంప్లేట్ ట్వీట్లు వేసేస్తున్నాయి. తమిళ హీరో కోసం తెలుగు నిర్మాతలు వెంపర్లాడుతున్నారనే ఫీలింగ్ తెప్పించడానికే ఈ పని చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ వాస్తవం ఏంటంటే.. తమిళంలో దర్శకులు, నిర్మాతల పనితనం తగ్గిపోవడంతో అక్కడి హీరోలు తెలుగు డైరెక్టర్లు, నిర్మాతల వైపు చూస్తున్న మాట వాస్తవం. ఇది గుర్తించకుండా పారితోషకం గురించి ఇలా ఫేక్

# టాప్ లేపుతున్న 'చిరుత' పిల్ల.. నేహా శర్మ గ్లామర్ విందు!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన -చిరుత- చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న భామ నేహా శర్మ. ప్రస్తుతం ఈ -చిరుత- పిల్ల సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ప్రసిద్ధ ఫ్యాషన్ మ్యాగజైన్ -గ్రాజియా- కవర్ పేజీ కోసం శర్మా గాళ్ చేసిన ఫోటోషూట్ నెట్టింట మంటలు పుట్టిస్తోంది. బ్లాక్ థీమ్డ్ డిజైనర్ డ్రెస్సులో నేహా తన అందచందాలను ఆరబోస్తూ ఇంటర్నెట్ షేక్ చేస్తోంది. ఈ కవ్విస్తున్న తీరు చూస్తుంటే శర్మ గాళ్ గ్లామర్ డోస్ గతంలో కంటే ఇప్పుడు పీక్స్‌కు చేరుకుందని అర్థమవుతోంది. చీవ౯ ౯్ఖుఎ చాశ్రీంశీ =ముఃం - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు! చాఃజవతీఅంవఎవత్ నేహా శర్మ తన సోషల్ మీడియా ఖాతాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు టచ్‌లో ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో వరుస ఫోటోషూట్లతో విపరీతంగా చెలరేగిపోతోంది. ముఖ్యంగా బ్యాక్‌లెస్ ఫోటోలు, చిట్టి పొట్టి నిక్కర్లు, బికినీ వీడియోలతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. గ్రాజియా కవర్ పేజీపై ఆమె కనబరిచిన ముగ్ధమనోహర రూపం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫోటోషూట్‌లో నేహా ఎంతో ఆత్మవిశ్వాసంతో, మునుపెన్నడూ లేని విధంగా తన బోల్డ్ లుక్స్‌తో కట్టిపడేస్తోంది. డైలమాలో స్టార్ డైరెక్టర్లు.. తాజా గ్రాజియా ఫోటోషూట్ కోసం నేహా శర్మ ఎంచుకున్న బ్లాక్ అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. మేకప్ ఆర్టిస్ట్ ప్రియాంక చౌరాసియా.. హెయిర్ స్టైలిస్ట్ కింబర్లీ చు ఆమెను దేవకన్యలా తీర్చిదిద్దగా.. ఫోటోగ్రాఫర్ ఇషాన్ జాకా తన కెమెరాలో ఆ అందాలను అద్భుతంగా బంధించారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు నేహా శర్మ అసలు అదుపు తప్పింది! అంటూ క్రేజీ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. చిరుత బ్యూటీ అందం -అభినయం రెండూ ఈ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాశ్రీంశీ =ముఃం - ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! ఇక నేహా శర్మ కెరీర్ విషయానికి వస్తే.. 2026లో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఇల్లీగల్, 36 డేస్ వంటి వెబ్ సిరీస్‌లతో తన సత్తా చాటిన నేహా.. 2026లో మరిన్ని భారీ ప్రాజెక్టులతో అలరించే వీలుందని తెలుస్తోంది. ముఖ్యంగా పంజాబీలో జస్సీ గిల్‌తో కలిసి సంజోగ్ అనే చిత్రంలో నటిస్తోంది. హిందీలో కూడా కొన్ని ప్రతిష్టాత్మక చిత్రాలతో పాటు.. ఓటీటీలో మరిన్ని క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లు చేయడానికి సిద్ధమవుతోంది. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో కూడా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని నేహా భావిస్తోంది. వైవిధ్యమైన పాత్రలు చేస్తూనే.. గ్లామర్ పరంగా తన ఫ్యాన్ బేస్‌ను మరింత పెంచుకుంటోంది. ఏది ఏమైనా తన గ్లామరస్ పోస్టులు, అద్భుతమైన నటనతో నేహా శర్మ 2026లో కూడా ట్రెండింగ్ సెలబ్రిటీగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

# గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై శ్రీలీల..

**శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం.**

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ఇప్పుడు కేవలం సౌత్ ఇండియాకే పరిమితం కాకుండా నేషనల్ లెవల్లో మెరిసిపోతోంది. 'హార్పర్స్ బజార్ ఇండియా' డిజిటల్ కవర్ స్టార్‌గా నిలిచిన ఈ బ్యూటీ, స్టార్ హీరోయిన్‌గా ఇండస్ట్రీ లో తనదైన ముద్ర వేస్తోంది. గ్లామర్ కంటే నిజాయితీతో కూడిన నటనకే తాను ప్రాధాన్యత ఇస్తానని చెబుతున్న శ్రీలీల.. మన ఊరి కథలే ప్రపంచాన్ని మెప్పిస్తాయని నమ్ముతోంది. తాజాగా ఆమె పంచుకున్న తన సినీ ప్రయాణం మరియు భవిష్యత్తు ఆలోచనలు ఇవే.. చాశ్రీంశీ =ముఃం - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు! చాఃజవతీఅంవఎవత్ స్టార్‌డమ్ వెనుక నిశ్శబ్ద ప్రయాణం: శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం. "ఇది ఒక్కసారిగా వచ్చిన గుర్తింపు కాదు, నిశ్శబ్దంగా వేసిన అడుగులు ఇప్పుడు అందరికీ కనిపిస్తున్నాయి" అని ఆమె అంటోంది. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూ, పాతవి వదిలేస్తూ తనను తాను మల్చుకుంటున్నానని తెలిపింది. ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మర్చిపోకుండా, సామాన్యంగా ఉండటమే తన విజయరహస్యమని ఆమె తెలిపింది.

**- డైలమాలో స్టార్ డైరెక్టర్లు..**

పుష్ప 2' నుంచి బాలీవుడ్ ఎంట్రీ వరకు: శ్రీలీల కెరీర్ ఇప్పుడు పీక్ లో ఉంది. 'పుష్ప 2' లో తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా, తరువాత వచ్చిన 'గుంటూరు




కారం'లో కీలక పాత్ర పోషించి మెప్పించింది. ఇక తాజాగా ఈ ఉగాది కి ఉస్తాద్ భగత్ సింగ్ తో అలరించింది. ఇప్పుడు అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్ సరసన బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమైంది. ప్రాంతీయ సరిహద్దులు చెరిగిపోతున్న ఈ సమయంలో, విభిన్న పాత్రల్లో జీవించడం తనకెంతో ఇష్టమని ఆమె అంటోంది. రకరకాల లెన్స్‌ల ద్వారా ప్రపంచాన్ని చూడటం తన ప్రయాణానికి దిక్సూచిగా మారిందని వివరించింది. ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! మన మూలాలే మన బలం: భారతీయ సినిమా తర్వాతి దశ గురించి శ్రీలీల ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. "మన కథలు ఎంత లోకల్‌గా, మన మూలాలకు దగ్గరగా ఉంటే.. అవి అంత గ్లోబల్‌గా ప్రజలకు చేరువవుతాయి" అని ఆమె బలంగా నమ్ముతోంది. మన చిన్న పట్టణాల్లోని కథలు, మన సంస్కృతి, మన గుర్తింపును ప్రపంచ ప్లాట్‌ఫామ్‌పై ఎక్కడా తగ్గకుండా చూపించాలని ఆమె ఆశిస్తోంది. కథలను సింప్లిఫై చేయకుండా, వాటి ఒరిజినల్ కాపాడుతూనే ప్రపంచాన్ని గెలవవచ్చని శ్రీలీల అభిప్రాయపడింది. చాశ్రీంశీ =ముఃం - హీరోయిన్ల రెమ్యూనరేషన్లు తగ్గుతున్నాయా కారణమేంటి వైద్య విద్యార్థి నుంచి గ్లోబల్ స్టార్ వరకు: ఒకవైపు డాక్టర్ విద్యను పూర్తి చేసి, మరోవైపు థియేటర్లను ఊపేసే హీరోయిన్ గా , ఈ రెండు భిన్నమైన పాత్రలను శ్రీలీల బ్యాలెన్స్ చేస్తున్న తీరు అద్భుతం. స్టార్‌డమ్ తలకెక్కించుకోకుండా, నిలకడగా తన లక్ష్యం వైపు దూసుకుపోతోంది. ఇక కేవలం గ్లామర్ హీరోయిన్ కాకుండా, బాధ్యతగల నటిగా గుర్తింపు తెచ్చుకోవాలన్న ఆమె తపన మెచ్చుకోదగ్గది. భవిష్యత్తులో శ్రీలీల మరిన్ని వైవిధ్యమైన కథలతో గ్లోబల్ స్టేజ్ మీద తన జెండా ఎగురవేయాలని ఆశిద్దాం..

EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016